మనసులో మాట
KANCHARLA
నిజమే మా బలం.. అదే మా ఐశ్వర్యం.. సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ
అమలాపురం | తణుకు | ఏలూరు | భీమవరం
బుధవారం 15 జూలై 2026 పేజీలు 16

## సాగునీటి సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



4

# కార్మికులకు ఆధునిక వైద్య సేవలు

కార్మిక సంక్షేమంలో మరో ముందడుగు..



- రాజమహేంద్రవరంలో రూ.75 కోట్లతో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ప్రారంభం
- కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట..
- 50 నుంచి 100 పడకలకు విస్తరణ.. అత్యాధునిక వైద్య సదుపాయాలు
- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ వర్చువల్‌గా ప్రారంభోత్సవం
- అవసరమైతే వైద్యుల సంఖ్య పెంపునకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం
- మంత్రి వాసంశెట్టి సుభాష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 14**

రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకల అత్యాధునిక ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం కార్మికులకు ఎంతో ఉపయోగపడే ముందడుగని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.మంగళ వారం సాయంత్రం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం లోని హైదరాబాద్ సనత్‌నగర్ ఈఎస్ఐ హాస్పిటల్ నూతన ఓపీడీ బ్లాక్‌ను కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం ప్రారంభించారు. అనంతరం అదే వేదిక నుంచి దేశవ్యాప్తంగా నిర్మించిన ఆరు ఈఎస్ఐ భవనాలలో భాగంగా రాజమహేంద్రవరం ..మిగతా 2లో

# సర్ గడువు జూలై 24 వరకు పొడిగింపు..




2

- ప్రత్యేక విస్తృత సవరణ గడువు పొడిగింపును
- పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా పరిధిలో 99.75 శాతం డిజిటలైజేషన్ పూర్తి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 14**

జిల్లాలో ప్రత్యేక విస్తృత సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ -సర్ ) కార్యక్రమానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం సవరించినజూలై 24 వరకు కాలపరిమితి నీ పెంచుతూ షెడ్యూల్‌ను విడుదల చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళ వారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ..మిగతా 2లో



## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

- సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

7

## అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను అందించండి

- అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను నేర్పండి
- ప్రతి మాసం మూడో వారంలో ప్రతి అంగన్వాడీ
- అంగన్వాడీల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లాకలెక్టర్ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

2





# సర్ గడువు జూలై 24 వరకు పొడిగింపు..


(మొదటిపేజీ తరువాయి)

బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన కార్యక్రమాన్ని జూలై 24, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునఃఅమరికను జూలై 24 నాటికి పూర్తి చేయాలని, ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించబడతాయని, వాటి పరిష్కారం సెప్టెంబర్ 28 నాటికి పూర్తి చేసి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును అధికారులు, బీఎల్‌వోలు సమర్థవంతంగా వినియోగించుకుని తూర్పు గోదావరి జిల్లాలో ఎటువంటి తప్పిదాలు లేని, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు కూడా లిఖిత పూర్వకంగా సమాచారం అందించాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమంలో జిల్లా పురోగతి సంతృప్తికరంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని 18,46,723 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు 100 శాతం పంపిణీ పూర్తికాగా, 16,74,681 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటైజ్ చేయడం ద్వారా 90.68 శాతం, ఇప్పటికే ఉన్న ఏ ఎస్ డి డి డేటాతో కలిపి మొత్తం 99.75 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసి జిల్లాలో తప్పులేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## గోపులంకలో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

**తాళ్లరేవు (మనసులో మాట), జూలై 14:**

మండల పరిధిలోని గోవలంక, పిల్లంక ఇసుక ర్యాంపులనుంచి యదేచ్ఛగా ఇసుకను గౌతమి గోదావరి ఏటిగట్టుపై తరలిస్తున్న లారీలను స్థానికులు మంగళవారం రాత్రి అడ్డుకున్నారు. ఇరుకుగా ఉండే ఈ రహదారిలో అధిక సంఖ్యలో లారీలు వేగంగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామాలైన గోపులంక, గోపాలపురం, పిల్లంక గ్రామాలకు చెందిన ప్రజలు రహదారిపై ఆందోళనకు దిగారు. లారీలను నిలిపివేసి నినాదాలు చేసారు. నిత్యం అనేక లారీలు వేగంగా సంచరిస్తుండడంతో రహదారిపై వెళ్లాలంటేనే భయమేస్తుందని వాపోతున్నారు. అధికారులు, పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడంలేదని, లారీల కారణంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక లారీలను నియంత్రించాలని కోరుతున్నారు.



# కార్మికులకు ఆధునిక వైద్య సేవలు

(మొదటిపేజీ తరువాయి)



ఇ ఎస్ ఐ భవనాన్ని కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, నూతన ఆసుపత్రి ద్వారా రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో సుమారు రూ.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాయన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. నూతన కార్మిక చట్టాల అమలుతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన మేరకు వైద్యుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ వర్చువల్‌గా మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో కార్మికులు, యువత కీలక శక్తులని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర అమూల్యమని, వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన వైద్య సదుపాయాల ద్వారా దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. సామాజిక భద్రత, మెరుగైన ఉపాధి అవకాశాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

మహిళల ఉపాధి భాగస్వామ్యం పెరుగుతోందని, వారికి సమాన పనికి సమాన వేతనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈఎస్ఐసీ జోనల్ మెడికల్ కమిషనర్ డాక్టర్ అషిత్ ముల్లిక్ మాట్లాడుతూ, సుమారు రూ.70 కోట్ల వ్యయంతో 13,376 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్‌తో పాటు రెండు అంతస్తుల్లో ఆసుపత్రి భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. 26 ప్రత్యేక ఔట్‌పేషెంట్ విభాగాలు, మూడు ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర ఆపరేషన్ థియేటర్, సమగ్ర ఐసీయూ, శస్త్రచికిత్సల ముందు, అనంతర వార్డులతో కూడిన అత్యాధునిక వైద్య సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు మంజూరైన నెలవారీ పెన్షన్ మంజూరు పత్రాలను మంత్రి సుభాష్ అందజేసి, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్ డైరెక్టర్ వి. ఆంజనేయులు, ఈఎస్ఐసీ రీజనల్ డైరెక్టర్ ఎం. రామారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరరావు, ఈఎస్ఐసీ జాయింట్ డైరెక్టర్ ప్రణవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను అందించండి

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**



అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నందు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ కు చెందిన సిడిపిఓలతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, అంగన్వాడి కేంద్రాల, అంగన్వాడి కేంద్రాల్లో తాగునీరు మరుగుదొడ్లు నిర్వహణ,పాజిటివ్ పబ్లిక్ పర్ఫెక్షన్, చిన్నారులకు ఆటపాటలతో వివిధ కృత్యాలు నేర్పించడం, సీడీపీవోల పరిధిలోని అంగన్వాడి కేంద్రాలు తనిఖీ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ఐసీడీఎస్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1986 అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను అందించాలనే లక్ష్యంతో సిడిపిఓ లు ప్రత్యేక శ్రద్ధ తో పనిచేయాలన్నారు. 05 పిల్లలకు పోషకాహారం ను అందించడం ద్వారా వారిలో బరువు,ఎత్తు పెరుగుదల (గ్రోత్) కు సంబంధించి ప్రతి నెలా బరువు,ఎత్తు ను చెక్ చేయాలన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న సేవలను మరింత పటిష్టం చేయాలని,ముఖ్యంగా పౌష్టికాహార పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, అంగన్వాడి కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాల నిర్వహణలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. చిన్నారులకు అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం ఇతర పౌష్టిక ఆహారం చిన్నారులందరికీ సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాభ్యాసం, వారిలో సృజనాత్మకతను పెంపొందించే కృత్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ప్రతి మాసంలో మూడవ వారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పిల్లలకు అందిస్తున్న సేవలపై వారికి వివరించాలని, దీనితోపాటు చిన్నారుల పెరుగుదలకు వారి తల్లిదండ్రులు తీసుకోవలసిన అంశాలపై కూడా వివరించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు అందిస్తున్న సేవలపై లబ్ధిదారులలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.సీడీపీఓ లు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపి ఓలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పూజ్య గురువులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు జన్మదినోత్సవం

- (జులై 14)సందర్భంగా...

**కాకినాడ (మనసులో మాట) జులై 14**

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలుగు సమాజంలో ఎనలేని గౌరవ ప్రతిష్టలు కలిగిన గొప్ప ప్రవచనకర్త. సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా చేర్చడంలో ఆయన చేస్తున్న కృషి అసాధారణమైనది. మానవ ధర్మం మీద ఆసక్తితో అష్టాదశ పురాణములను అధ్యయనము చేసి, తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్ధమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ, భక్త జన మనసులను దోచుకుని ఏ ప్రవచనం చెబుతున్నా ఆ భగవత్ తత్వంలో మునిగిపోయిన తాదాత్మ్యత చాగంటి వారిలో కనిపిస్తుంటుంది. అసాధారణ ధారణాశక్తి, మందాకినీ ప్రవాహం వంటి వాక్కు. విద్యకు పరమావధి అయిన వినమ్రత, శిశుహృదయాన్ని తెలియజేసే నిష్కల్మష దరహాసం, ధర్మమునందు అనురక్తి ఇలా ఎన్నో సుగుణాల సమాహారం ఒక తేజోమయ రూపంగా ఆయనలో ప్రవేశించి మన మనస్సులను ఆయన వైపు ఆకర్షిస్తుండవచ్చు. వీటన్నింటినీ మించిన కారణం కూడా ఒకటుందనిపిస్తుంది. అది చాగంటి వాగింద్రియానికి మన శ్రోత్రేంద్రియానికీ లభించిన ఈశ్వరకటాక్షం. ఇవాళ సినిమా హీరోలలో అగ్రహీరోలకు ఏమాత్రం తీసిపోని పేరుప్రఖ్యాతులు కలిగిన ప్రవచనకారుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు. గత పదిహేనేళ్లలో ఆయన సాధించిన ప్రతిష్ట మరే ఇతర ఆధ్యాత్మిక వేత్తలకు దక్కలేదు అనేది నిస్సందేహం. అఖండ ప్రజ్ఞావంతుడు, పండితుడు, వేదమూర్తి చాగంటి. ఆయన ఎంతటి ఖ్యాతి గడించారు.

**బాల్యం :** చాగంటి కోటేశ్వరరావు ఒక ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త. అతను తూర్పు గోదావరి జిల్లా కాకినాడ వాస్తవ్యులు. ఆయన తండ్రి చాగంటి సుందర శివరావు, తల్లి సుశీలమ్మ. 1959 జూలై 14వ తేదిన జన్మించారు. చాగంటి కి ఆరేడేళ్ల వయసులోనే తండ్రి గతించారు. ఆయనకు ముగ్గురు తోబుట్టువులు.ఒక అక్క, ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. తల్లి కష్టపడి నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేసారు. వారికి ఆస్తిపాస్తులు లేవు. కడు పేద కుటుంబం. సంసారానికి తాను మాత్రమే పెద్ద దిక్కు అని తెల్సుకున్న చాగంటి అహోరాత్రాలు కష్టపడి విద్యను అభ్యసించారు. పాఠశాల స్థాయినుంచి యూనివర్సిటీ స్థాయివరకు గోల్డ్ మెడలిస్టుగా ఎదిగారు.కోటేశ్వరరావు సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరి. వీరికి ఇద్దరు పిల్లలు అతను ధారణ శక్తి, జ్ఞాపకశక్తి చెప్పుకోదగ్గవి. మానవ ధర్మం మీద ఆసక్తితో అష్టాదశ పురాణములను అధ్యయనము చేసి, తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్ధమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ, భక్త జన మనసులను దోచుకున్నారు. ఉపన్యాస చక్రవర్తి, శారదా జ్ఞాన పుత్ర, ఇత్యాది బిరుదులను అందుకున్నారు.

**ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గా**

చాగంటి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గాపనిచేసారు .ఆయన భార్య వ్యవసాయ శాఖ లో ఉన్నతాధికారిణి. చాగంటి ఆఫీసుకు సాధారణంగా సెలవు పెట్టరు. ఒక్కసారి కూడా లేట్ పెర్మిషన్స్ తీసుకోరు. ప్రవచనాలకు అతను పారితోషికం తీసుకోరు. తన విద్యను రాజులకు అమ్ముకోని వారిలో అప్పట్లో బమ్మెర పోతన తరవాత చాగంటి వారే అని చెప్పాలి.ఎక్కడికైనా బయట నగరాలకు వెళ్లి ప్రవచనాలు ఇవ్వాల్సివస్తే అతను తన సొంత డబ్బుతో టికెట్ కొనుక్కుని ప్రయాణం చేస్తారు తప్ప నిర్వాహకుల నుంచి డబ్బు తీసుకోడు . ఇంతవరకు అతనుకు కారు లేదు. ఆఫీసుకు కూడా మోటార్ సైకిల్ మీద వెళ్తారు.

**ధారణాశక్తి :**

అతను ధారణాశక్తి గొప్పది. ఒకసారి శంకరుల సౌందర్యలహరి తిరగేస్తే అది మొత్తం అతను మదిలో నిలిచిపోతుంది. ఎక్కడ ఏ పేజీలో ఏమున్నదో చెప్పగలరు.

**కుటుంబ బాధ్యతలు:**

అతను ఉద్యోగంలో చేరాక తోబుట్టువుల బాధ్యతను స్వీకరించారు. అక్క, చెల్లెలు, తమ్ముడుకు తానే తన సంపాదనతో వివాహాలు చేశారు. కుటుంబం కోసం తన కష్టార్జితాన్ని మొత్తం ధారపోశాడు. అప్పుడపుడు కాకినాడలో అయ్యప్ప దేవాలయంలో సాయంత్రం కూర్చుని భక్తులముందు భారత భాగవత ప్రవచనాలు ఇచ్చేవారు. ఏనాడూ డబ్బు పుచ్చుకునే వాడు కాదు. అతను స్వరలాలిత్యం, ధారణ, విజ్ఞానం, విశదీకరణ భక్తులను ఆకర్షించాయి. అభిమానులు పెరిగారు. చాగంటి వేదవేదాంగాలు, పురాణాలు, ఉపనిషత్తులు అవపోసన పట్టారని చాలామంది పొరపడతారు. కానీ అవన్నీ ఆయనకు పూర్వజన్మ సుకృతంగా లభించినవి అని, ఇది వారికి భగవంతుడు ఇచ్చిన వరం అని చెప్పాలి. ఎందుకంటే ఎంత సాధన చేసిన ఇలాంటి విషయాలు ఎక్కువకాలం గుర్తుండవు. కానీ చాగంటి లాంటి వరప్రసాదితులకు మాత్రమే ఇది సాధ్యం.

**పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో**

ఎక్కడో ఒకచోట చాగంటి ని కలిశారు. మీ గురించి ఎంతో విన్నాను. మీ ఆధ్యాత్మిక పరిజ్ఞానం అసాధారణం. మీ ప్రవచనాలు నాకు బాగా నచ్చాయి. ముఖ్యంగా మీ పాండితీప్రకర్ష అమోఘం. ఇప్పుడు నేను మంచి స్థితిలో ఉన్నాను. ఏమైనా అడగండి. చేసిపెడతాను అన్నారు. పీవీ.చాగంటి నవ్వేసి మీకూ, నాకు ఇవ్వాల్సింది ఆ పరమాత్మే తప్ప మరెవరూ కారు. మీ సహృదయానికి కృతజ్ఞతలు. నాకేమీ ఆశలు లేవు.అని నమస్కరించి బయటకు వెళ్లిపోయారు.

**బయట ప్రాంతాల్లో:**

అతను బయట ప్రాంతాల్లో ప్రవచనాలు ఇవ్వడం వారి అమ్మగారు 1998 లో స్వర్గస్తులు అయ్యాక ప్రారంభించారు. ఎందుకంటే చాగంటి వంశంలో గత ఆరు తరాలుగా ఆ సరస్వతి కటాక్షం ఎవరో ఒక్కరికే వస్తున్నది. ఈ తరంలో ఆ శారదాకృప నలుగురు పిల్లలలో చాగంటి కోటేశ్వర రావుపై ప్రసరించింది. ఆ మాత దయను తృణీకరించలేక తనకు తెలిసిన జ్ఞానాన్ని లోకానికి పంచుతున్నారు చాగంటి.

**ప్రవచనాలు:**

చాగంటి కోటేశ్వర రావు ప్రసంగించిన ప్రవచనాలు సంపూర్ణ రామాయణము, ఇవి బాల కాండ నుండి పట్టాభి షేకము వరకు చెప్పబడ్డాయి. శివ పురాణములోని భక్తుల కథలు, మార్కండేయ చరిత్ర, నంది కథ, జ్యోతిర్లింగ వర్ణన, లింగావిర్భావము, రమణ మహర్షి జీవితము మొదలైన అనేక విషయాలు చోటు చేసుకున్నాయి. విరాట పర్వము అనే ప్రవచనంలో భారతము లోని అజ్ఞాత వాస పర్వము వివరించబడింది. భాగవతము అనే ప్రవచనంలో భాగవతుల కథలు, కృష్ణావతారం యొక్క పూర్తి కథ చోటు చేసుకుంది. భాగవత ప్రవచనాలలో ప్రథమముగా శ్రీకృష్ణ నిర్యాణం, పాండవుల మహాప్రస్థాన కథ చోటు చేసుకున్నాయి. సౌందర్య లహరి ఉపన్యాసాలు ఆదిశంకరాచార్య విరచిత సౌందర్యలహరికి వివరణ ఉంది. శిరిడీ సాయి బాబా కథ చోటు చేసుకుంది. ఇంకా రుక్మిణీ కల్యాణం, కనకధారాస్తోత్రం, గోమాత విశిష్టత, భజగోవిందం, గురుచరిత్ర, కపిల తీర్థం, శ్రీరాముని విశిష్టత, తిరుమల విశిష్టత, హనుమజ్జయంతి, హనుమద్వైభవం, సుందరకాండ, భక్తి, సామాజిక కర్తవ్యం, శంకరాచార్య జీవితం, శంకర షట్పది, సుబ్రహ్మణ్య జననం మొదలైన ప్రవచనాలు చేసారు కోటేశ్వర రావు. అతను తన వాక్పటిమతో హృద్యమైన ప్రవచనములను చేసి ప్రముఖుల నుండి ప్రశంసలు అందుకున్నారు.



**అద్భుతమైన వాగ్ధాటి, జ్ఞాపకశక్తి**

చాగంటి ప్రవచనాల శైలి చాలా విలక్షణమైనది. ఎలాంటి కాగితాలు, పుస్తకాలు ముందర పెట్టుకోకుండా రామాయణ, మహాభారత, భాగవతాది గ్రంథాలలోని వేల శ్లోకాలను, వాటి అర్థాలను, ఘట్టాలను నోటిపాఠంగా చెబుతుంటే వినేవారు మంత్రముగ్ధులవుతారు.ఆయన గంభీరమైన కంఠస్వరం, స్పష్టమైన ఉచ్చారణ వినేవారిని ఆ కాలంలోకి తీసుకెళ్తాయి.

**ధర్మాన్ని నిత్యజీవితానికి ముడిపెట్టడం**

పురాణ కాలం నాటి విషయాలను కేవలం కథలుగానే కాకుండా, ప్రస్తుత సమాజానికి అవి ఎలా ఉపయోగపడతాయో ఆయన వివరిస్తారు. తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి? భార్యాభర్తల బంధం ఎలా ఉండాలి? సమాజంలో ఒక వ్యక్తి బాధ్యత ఏమిటి? వంటి నిత్యజీవిత అంశాలను పురాణ పాత్రల ద్వారా విడమర్చి చెబుతూ, ఎంతోమంది యువతను సన్మార్గంలో పెట్టారు.

**నిస్వార్థ సేవ:**

చాగంటి గొప్పతనంలో అత్యంత కీలకమైనది ఆయన నిస్వార్థత. ఆయన తన ప్రవచనాలను ఎప్పుడూ ఒక వ్యాపారంగా మార్చుకోలేదు. ప్రవచనాలు చెప్పినందుకు ఆయన ఎలాంటి పారితోషికం (డబ్బు) ఆశించరు, తీసుకోరు.ధర్మ ప్రచారం కోసమే తన జీవితాన్ని అంకితం చేశారు.

**సేవా కార్యక్రమాలు:**

కేవలం మాటలతోనే కాకుండా చేతల్లోనూ ఆయన తన ధర్మాన్ని చూపిస్తారు. గోసంరక్షణ (ఆవులను కాపాడటం), పేద విద్యార్థులకు విద్యాదానం, ఆకలితో ఉన్నవారికి అన్నదానం వంటి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను ఆయన తన ప్రవచనాల ద్వారా వచ్చే విరాళాలతో (ట్రస్ట్ ద్వారా) నిర్వహిస్తున్నారు.

**ప్రభుత్వ సలహాదారుగా:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుని నియమిచారు. కేబినెట్ ర్యాంక్‌తో రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.చాగంటి కోటేశ్వరరావుతో ప్రత్యేకంగా పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు పుస్తకాలు తయారు చేయించి పంపిణీ చేయుచున్నారు.

## అందుకున్న పురస్కారాలు...

శారదా జ్ఞాన పుత్ర
వాచస్పతి పురస్కారం
పిన్నమనేని పురస్కారం లాంటి విశిష్ట పురస్కారాలు ఎన్నో అందుకున్నారు.

అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడే వారే కరువైపోతున్నారు. అలాటిది స్వచ్ఛమైన భాషలో, నిబద్ధతో మాట్లాడ గల దిట్ట చాగంటి . వీరికి భాష పై ఉన్న పట్టు అపారం. విషయంతో పాటు నిక్షిప్త, నిగూడార్థాలు తెలిసుకున్నవారు, వీరికి వాక్ సుద్ధి ఉంది. వీరు ప్రసంగించి నప్పుడు జనాలు మంత్ర ముగ్దులు అవటం ఖాయం పండితులు, పామరులు అందరూ హర్షిస్తారు.విషయాన్ని అంత సూటిగా, సరళముగా జనముందుంచుతారు. ఆలోచింప చేయిస్తారు. ఇది అసామాన్యమైన విషయం.చాగంటి కోటేశ్వర రావు కేవలం ఒక ప్రవచనకర్త మాత్రమే కాదు. తెలుగు నాట సనాతన ధర్మానికి, నైతిక విలువలకి నిలువెత్తు రూపం. ఆధునిక కాలంలోనూ మన సంస్కృతిని, సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందిస్తున్న గొప్ప మార్గదర్శి.పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగులు పెడుతున్న తెలుగు సమాజానికి, మన మూలాలను గుర్తు చేస్తూ, సనాతన ధర్మం వైపు నడిపిస్తున్న ఒక గొప్ప దిక్సూచి



## వాడపల్లి వెంకన్న ఆలయ అన్నదాన పథకానికి రూ, లక్ష విరాళం

**కొత్తపేట (మనసులో మాట )జూలై 14**

కోనసీమ తిరుమల గా బాసిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యన్నదానపథకానికి అమలాపురం చెందిన నిరిగినీడి వెంకన్న నాయుడు, ఈశ్వరమ్మ దంపతులు రూ,1,01,116 డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కు అందజేశారు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, వేదా ఆశీర్వచనం, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.



## చేతులు కట్టుకోవద్దు... కాళ్లు పట్టుకోవద్దు

- పెద్దాపురంలో వినూత్న ఫ్లెక్సీ..

**పెద్దాపురం (మనసులో మాట) జూలై 14;**

రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలు చేతులు కట్టుకోవద్దు... కాళ్లు పట్టుకోవద్దు అంటూ పెద్దాపురం రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయబడిన ఒక ఫ్లెక్సీ ప్రజలను ఆశ్చర్య చకితులు చేస్తోంది. ఇటీవల పెద్దాపురం తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ కార్యాలయ గోడ పై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పెద్దాపురం డివిజన్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ కార్యాలయం మన అందరిదీ, ఇక్కడ అధికారులను మీరు కలిసే సమయంలో.... చెప్పులు విడవకండి, చేతులు కొట్టుకొని ఒంగి నిలుచోవద్దు, కన్నీళ్లు పెట్టుకోకండి, కాళ్లు పట్టుకోకండి, ఆత్మగౌరవంతో మీ సమస్యలను స్పష్టంగా వివరించండి..అంటూ ... ఏర్పాటు చేయటం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. కార్యాలయానికి వచ్చే ప్రజలకు తహశీల్దార్ శ్రీనివాస్ చేసిన విజ్ఞప్తి ప్రజల హృదయాల్లో సరికొత్త ఆలోచనలకు నాంది పలికింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ప్రజల పట్ల అధికారులు ఇలా వ్యవహరిస్తే సమాజం మంచి పురోగతి సాధిస్తుంది.




# సాగునీటి సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం(మనసులోమాట) జూలై 14,**



జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి పంపిణీకి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన, ఉప కాలువల్లో నీటి ప్రవాహం, నీటి ఒత్తిడి, దిగువ ప్రాంతాలకు సాగునీటి సరఫరా పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి తగ్గడం, లోతట్టు ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరకపోవడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కాలువల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా నీటి ప్రవాహం కొనసాగేందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, పొలాలకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా కాలువల నిర్వహణను మెరుగుపరచాలని తెలిపారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

దిగువ ప్రాంత రైతులకు కూడా సమానంగా సాగునీరు అందేలా నీటి పంపిణీ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని, రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో కాలువల్లో పూడిక పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో నూతనంగా నిర్మించిన వంతెనల వద్ద పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు వ్యవసాయ, నీటిపారుదల, జాతీయ రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోదావరి డెల్టా దిగువ ప్రాంతాలైన కె. గంగవరం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు పలువురు వినతులు అందజేశారని కలెక్టర్ తెలిపారు. ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన కుర్రపు డెక్కలు, తూములు తదితర అవరోధాలను తొలగిస్తే నీటి ప్రవాహం వేగవంతమై లోతట్టు ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ఏఈలు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## సమాజ సేవ సంకల్పంతోనే టీబీఆర్ సైనిక్ స్కూల్

- డిఫెన్స్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం
- విద్యతో పాటు సైన్యంలోకి విద్యార్థులకు శిక్షణ
- 17 మంది అగ్నివీర్ కు ఎంపిక
- టీబీఆర్ సైనిక్ స్కూల్ అధినేత భోగేశ్వర రావు

**తాడేపల్లిగూడెం (మనసులో మాట జూలై 14 :**

డిఫెన్స్ విభాగంలో తాను చేసిన సేవలను సమాజానికి అందించాలని సంకల్పంతో టీబీఆర్ విద్యా సంస్థను స్థాపించినట్లు ఆ సంస్థ చైర్మన్ తనబుద్ధి భోగేశ్వర రావు తెలిపారు. మంగళవారం పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ఆవరణలో ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భోగేశ్వర రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అగ్నివీర్ పరీక్షకు టీవీఆర్ జూనియర్ కళాశాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది ఎంపికైనట్లు వివరించారు. గతంలో 12 మంది అగ్నివీర్ కు ఎంపిక కాగా, ముగ్గురు సైన్యంలోకి వెళ్లినట్లు తెలిపారు. విద్య ద్వారానే పేదరికాన్ని జయించవచ్చని, విద్య ఉపాధికి మార్గం చూపుతుందన్నారు. తమ విద్యాసంస్థలు విద్యతో సైనిక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలకు తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఐఐటి స్థాయి ఉపాధ్యాయులచే విద్యార్థులకు డిఫెన్స్ లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఆఫీసర్లకు అవసరమైన నైపుణ్యాలు, లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సైన్యంలో ఉండే సానుకూల, విజయవంత వాతావరణమే తమ పాఠశాలను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. సైన్యంతో పాటు విద్యార్థులు ఏ రంగంలోకి వెళ్లిన నిలదొక్కుకునే విధంగా శిక్షణ విద్య బోధన చేస్తున్నామన్నారు. మిలిటరీ అంటే సాధారణంగా భయం ఉంటుందని, అటువంటి భయం అవసరం లేదన్నారు. ధైర్యంగా సైన్యంలోకి చేరవచ్చని పిలుపునిచ్చారు. విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు తమ ఆకాంక్షలను మీడియాతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయి కృష్ణ, పరిపాలన అధికారి నాగరాజు పాల్గొన్నారు.

## ఎండీఎంను సమర్థంగా నిర్వహించాలి

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూలై 14 :**

మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి, నాణ్యతలో రాజీ లేకుండా సమర్థంగా నిర్వహించాలని ఎంఈవో2 టివి రామకృష్ణ సూచించారు. మంగళవారం పెంటపాడు మండలం అలంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థుల అభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఇంటి భోజనానికి బదులుగా పాఠశాల భోజనాన్ని విద్యార్థులకు అలవాటు చేస్తున్నామన్నారు. తద్వారా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న పోషకాహారం విద్యార్థులకు చేరుతుందన్నారు. ఎండీఎం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు జోగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ కనకారావు ఎండీఎం సిబ్బంది గొర్రెల వెంకటేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.



# దూరంగా ఉన్నా ప్రజల చెంతనే

- సమస్య ఏదైనా స్పందన తక్షణం
- తాళ్లపాలెం అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీటి సమస్యపై
- ముంబయి నుంచే స్పందించిన మంత్రి కందుల దుర్గేష్
- రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం
- ముంబయి నుండి తాళ్లపాలెం పరిస్థితిని వీడియో కాల్ లో సమీక్షించి
- యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం



**నిడదవోలు (మనసులో మాట) జులై 14**

నిడదవోలు మండలం తాళ్లపాలెం వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలోకి పరిసర ప్రాంతాల చేలు, కాలువ నుండి భారీగా నీరు చేరడంతో తాడేపల్లిగూడెం వెళ్లే మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో ముంబయి పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ కి ఈ విషయంపై సమాచారం అందిన వెంటనే సత్వరమే స్పందించి వీడియో కాల్ లో అక్కడి నుంచే పరిస్థితిని సమీక్షించారు. తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించాల్సిందిగా తన కార్యాలయ సిబ్బందిని, జిల్లా అధికార యంత్రాంగాన్ని, కూటమి నాయకులను ఆదేశించారు.ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న పరిస్థితులను మంత్రి దుర్గేష్ స్వయంగా వీడియో కాల్ ద్వారా వీక్షించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రెండు మూడు రోజులుగా ఈ సమస్యపై చర్చిస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మంత్రి దుర్గేష్ ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత సిబ్బందితో పాటు ఇరిగేషన్ ఈఈ, నిడదవోలు ఎంపీడీవో ఆంజనేయ శర్మ, తహశీల్దార్ నాయక్ లు, కూటమి నాయకులు తక్షణమే తాళ్లపాలెం గ్రామానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా చేల నుండి నీరు వంతెన క్రిందికి చేరి నిలిచిపోతుండటంతో ఇప్పటికే ఒకట్రెండు పర్యాయాలు తొలగించినప్పటికీ సమస్య పునరావృత మైందని మంత్రికి తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి దుర్గేష్ ఆదేశాలతో అధికార యంత్రాంగం వంతెన క్రింద నిలిచిన నీటిని తొలగించేందుకు, రాకపోకలను పునరుద్ధరించేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు. మంత్రి దుర్గేష్ ముంబయి పర్యటనలో ఉన్నప్పటికీ సాంకేతికతను ఉపయోగించుకుని స్థానిక సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన తీరు పట్ల తాళ్లపాలెం గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జై కూటమి అని నినదించారు.





# తనయుడు పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నసంతర్పణ

**కాకినాడ (మనసులో మాట) జులై 14**

కాకినాడ 49వ డివిజన్ కూటమి నాయకురాలు బండి భోగేశ్వరి తనయుడు బండి నీహార్ అక్షయ్ పుట్టినరోజు సందర్భంగా రాజీవ్ గృహకల్ప లో ఉన్న అన్న క్యాంటీన్ నందు పేదలకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, సుపరిపాలన తో ముందుకు దూసుకుపోతున్న కూటమై ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. అలాగే మన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ సుపరిపాలనను అందించాలని కోరారు . పేదవాడికి కడుపు నింపుతున్న అన్నా క్యాంటీన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేద ప్రజలు ప్రతిరోజు ముఖ్యమంత్రి ని తలుచుకుంటూ పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేయడం చాలా సంతోషకరమని అన్నారు ఈ కార్యక్రమంలో నాని , బండి సుజాత , దారపు శిరీష , గొల్లపల్లి కుమారి , సబ్బే దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయంగా నాపై బురద జల్లడానికే ఆరోపణలు

- తప్పు చేయలేదు భయపడను న్యాయ పోరాటం చేస్తా
- జగనన్న కాలనీలో పన్నుల పేరుతో అక్రమ వసూళ్లు బయట పెడతాననే తప్పుడు కేసులు
- ఏలేశ్వరంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను ఇకపై ఎండగడతా
- రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పైలా సుభాష్ చంద్రబోస్



**ఏలేశ్వరం (మనసులో మాట) జులై 14**

తనపై రాజకీయ బురద జల్లడానికే తప్పుడు ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని,సోమవారం కాకినాడలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అసత్య ప్రచారాలు చేసారని ఏలేశ్వరం మున్సిపాలిటీ కి చెందిన రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పైలా సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు.మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో పన్నుల పేరుతో కొంతమంది నాయకులు చేస్తున్న అక్రమ వసూళ్ల వ్యవహారం బయటపడు తుందనే ఉద్దేశంతోనే తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని,సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని,న్యాయం జరుగుతుందని తెలిపారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎవరికి భయ పడేది లేదని స్పష్టం చేశారు.

తనపై వచ్చిన ఆరోపణల పై న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. ఇకపై ఏలేశ్వరం మున్సిపాలిటీ లో జరుగుతున్న అవినీతి,అక్రమాలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకొస్తానని పైలా సుభాష్ చంద్రబోస్ అన్నారు.

# సిపిఎం మాజీ కార్పొరేటర్ గోళ్ళమూడి నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి నివాళి

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**



కాకినాడ నగర పాలక సంస్థ లో సిపిఎం తరపున కార్పొరేటర్ గా పనిచేసిన గోళ్ళమూడి నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం సుందరయ్య భవన్ లో ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి. బేబిరాణి, నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు లు ముందుగా గోళ్ళమూడి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ తెనాలి లో జన్మించిన గోళ్ళమూడి నాగేశ్వరరావు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు కావడం వల్ల తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేసి విద్యార్థుల మనస్సుల్లో చెరగని ముద్ర వేసారన్నారు. ఒకవైపు ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ లో పనిచేస్తూ మరొక వైపు జన విజ్ఞాన వేదిక లో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. రిటైర్డ్ అయిన తరువాత కాకినాడ నగర పాలక సంస్థ లో 49 వ డివిజన్ కార్పొరేటర్ గా సేవలందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. అదేవిధంగా సుందరయ్య భవన్ నిర్మాణ కమిటీ కన్వీనర్ గా కృషి చేసారని తెలిపారు.కె. సత్తిరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన గోళ్ళమూడి పార్టీ సిద్ధాంతాలను, తీర్మానాలను అనుసరించడం, తన అభిప్రాయాలను సూటిగా చెప్పడం, యువతను ప్రోత్సాహం చించడం జరిగిందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అక్షర గోదావరి ఉద్యమంలో కో ఆర్డినేటర్ గా విశేషమైన కృషి చేసారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక ప్రారంభించిన రాష్ట్ర బృందం లో గోళ్ళమూడి నాగేశ్వరరావు ఒకరిని తెలిపారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్. రాజ్ కుమార్ ఈ సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలు వివరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. ఎస్. శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యానారాయణ లతో పాటు చంద్రమళ్ళ పద్మ, టి. రాణి, ఎం. హరనాథ్, కె. చిట్టిబాబు, జి. ప్రసాద్, అనపర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. మేడిశెట్టి వెంకటరమణ వందన సమర్పణ చేశారు.

# పుష్కరాల ఏర్పాట్లపై ఎస్పీ జేసితో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

- **పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు ముందస్తు కార్యాచరణ**
- **జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జులై 14**

రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.మంగళ వారం కొవ్వూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, కొవ్వూరు ఆర్డీవో కె ఆనందరావు, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ రెడ్డి, ఏ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీ డి. దేవకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా దొమ్మేరు శివారులోని ప్రైవేట్ భూములు, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే, గ్రీన్ ఫీల్డ్ టోల్ గేట్, దేవరపల్లి డైమండ్ జంక్షన్, ప్రక్కిలంక ఘాట్, పైడిమెట్ట గ్రామం, తాళ్లపూడి, కుమారదేవం తదితర ప్రాంతాల్లో పుష్కర్ నగర్లు, వాహన పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, భక్తుల రాకపోకలకు అనువైన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పుష్కరాల సమయం లో లక్షలాది మంది భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఏర్పాటును ముందస్తుగా శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధం గా రూపొందిస్తున్నామని తెలిపారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి, మరుగుదొడ్లు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసే సమయంలో వరద ముప్పు, భద్రత, రవాణా సౌలభ్యం, అత్యవసర సేవలు చేరుకునే అవకాశం వంటి అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేసి, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పుష్కర స్నాన ఘట్టాలను సందర్శించిన అధికారులు ఘాట్ల వద్ద నీటి లోతు, ప్రవాహ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, ఘాట్ల విస్తరణ అవసరం, బ్యారికేడింగ్, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక ప్రజలు, మత్స్యకారులు, గ్రామ పెద్దల నుంచి గత పుష్కరాల అనుభవాలు, నీటి మట్టం మార్పులు, ప్రమాదకర ప్రాంతాలపై సమగ్ర వివరాలు





సేకరించి వాటి ఆధారంగా కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఘాట్ల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధంగా వైద్య, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయ ప్రణాళిక సిద్ధం చేయాలి.రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళిక రూపొందించాలి. స్థానిక సంస్థలు, గ్రామస్థుల సహకారంతో అవసరమైన సమాచారం సేకరించి కార్యాచరణను మరింత సమర్థవంతం గా రూపొందించా లన్నారు.

**భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం**

**జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్**

జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ వ్యవస్థ, అత్యవసర స్పందన బృందాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఘాట్ వద్ద భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని చెప్పారు.

**జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ సూచనలు**

జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులకు పలు సూచనలు చేశారు. పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. పార్కింగ్ స్థలాలకు స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలి. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, రోడ్లుభవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జులై 17వ తేదిన రాజమహేంద్రవరం మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

- **నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు**
- **జిల్లా ఉపాధి అధికారి: సి హెచ్ శిరీష**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జులై 14**



తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం లోని ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో జూలై 17వ తేదీ (శుక్రవారం) ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ టీ వి ఎస్ లూకాస్ , జోయాలుక్కాస్ జ్యువలరీ కంపెనీలలో పలు పోస్టుల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని ఆయన తెలిపారు. ఇంటర్ నుండి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు.

ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా employment.ap.gov.in లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు.

## ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పారా లీగల్

- **వాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జులై 14**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ రూపొందించిన పారా లీగల్ వాలంటీర్స్ (పి ఎల్ వి ) పథకం కింద ఒక సంవత్సరం కాలపరిమితికి (నియామకం తేదీ నుంచి) పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయ దానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నివాసుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు (ఇంచార్జ్) జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు మెట్రిక్యులేషన్ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగి ఉండాలి. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థుల ఎంపిక మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా నిర్వహించబడుతుంది. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 18 ఆగస్టు 2026. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం లో 50 నుంచి 100 మంది వరకు, అలాగే అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, తుని, ఆలమూరు, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, ప్రత్తిపాడు, రంపచోడవరం, అడ్డతీగల మండల న్యాయ సేవాధికార కమిటీల పరిధిలో ప్రతి మండలానికి 25 నుంచి 50 మంది వరకు పారా లీగల్ వాలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు ఫారాలు పూర్తి వివరాల కోసం సమీపంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా సంబంధిత మండల న్యాయ సేవాధికార కమిటీల అధ్యక్షులు కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి..

- **అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూజలు**

**అయినవిల్లి(మనసులోమాట) జూలై 14:**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన స్వయంభూ శ్రీ సిద్ధి వినాయక దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని పి గన్నవరం ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ

ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం విఘ్నేశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం సోమవారం దర్శించుకుని పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారికి 101 కొబ్బరికాయల మొక్కు సమర్పించి, లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని ప్రజా సేవలోకి తిరిగి రావాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం దేవస్థానం నిధులతో నిర్మిస్తున్న అన్నపూర్ణ నిలయం (అన్న ప్రసాద భవనం) నిర్మాణ పనులను, అలాగే గోదావరి పుష్కరాల నిధులతో నిర్మిస్తున్న శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి, శ్రీ కేశవ స్వామి, శ్రీ కాలభైరవ స్వామి ఆలయాల నిర్మాణ పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

- సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

**నిడదవోలు (మనసులోమాట) జూలై14**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం జనసేనాని పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.



# అస్సాగో పరిశ్రమను పూర్తిగా తరలించాలి

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు
- బీఎస్పీ నేత జుత్తుక నాగేశ్వరరావు



**జగ్గంపేట, (మనసులో మాట) జూలై 14:**

గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ విస్తరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభ ప్రజల ఆగ్రహంతో ఉత్కంఠభరితంగా మారింది. బాధిత గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో పరిశ్రమ విస్తరణను వ్యతిరేకిస్తూ "అస్సాగో వద్దు... ప్రాణాలే ముద్దు" అంటూ నినాదాలతో సభను హోరెత్తించారు.అనంతరం సభను బహిష్కరించి భారీ ర్యాలీగా నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై జగ్గంపేట నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే అస్సాగో పరిశ్రమ కారణంగా గుమ్మలదొడ్డి, వెదురుపాక, అచ్చుతాపురం, బాబాజీపేట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని, గాలి, నేల, శబ్ద కాలుష్యంతో పాటు భరించలేని దుర్వాసన కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి పరిస్థితుల్లో రోజుకు రెండు నుంచి మూడు లక్షల లీటర్ల ఆల్కహాల్ ఉత్పత్తి సామర్థ్యంతో మరో యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం, ప్రజల జీవితాలతో చెలగాటమని మండిపడ్డారు.

# నాటు తుపాకీలకు బలవుతున్న విదేశీ పక్షులు

**అయినవిల్లి (మనసులో మాట) జూలై 14:**



ఖరీఫ్ సీజన్లో రైతులు పంట చేలు దమ్ము చేసే సమయంలో నైజీరియా దేశాల నుండి కోనసీమ ప్రాంతానికి పక్షులు వలస వస్తాయి. ఇవి దమ్ము చేసే చేలల్లో ఉండే నత్తలను ఆహారముగా తీసుకోవడానికి గుంపులు గుంపులుగా వరిచేలల్లోకి చేరుతాయి ఇదే క్రమంలో పక్షులను వేటాడే వేటగాళ్లు నాటు తుపాకులతో పక్షులను వేటాడి మాంసప్రియులకు అమ్ముకుంటున్నారు. ఈ నాటు తుపాకీ లో ఇనుప గోలీలు పటాస్ కలిపి గన్ లోకిలోడ్ చేసి పక్షుల గుంపు పై గురిపెట్టగా గన్ లో ఉన్న ఇనుప గుళ్ళు పక్షులకు తగలడంతో అవి అక్కడకక్కడే కింద పడి చనిపోతున్నాయి. మంగళవారం నేదునూరు మురుగు కాలువ వద్ద ముగ్గురు వేటగాళ్లు రెండు నాటు తుపాకులు పట్టుకుని పక్షులను వేటాడారు. ఇలా విదేశీ పక్షులను నిర్దాక్షిణ్యంగా చంపడం వలన వాటి సంతతి నశించిపోయే ప్రమాదం ఉందని పక్షుల ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వన్య ప్రాణి సంరక్షణ అధికారులు ఇటువంటి నాటు తుపాకీతో పక్షులను వేటాడే వారిని అదుపులోకి తీసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మస్కట్‌లో చిక్కుకున్న మహిళను సురక్షితంగా
# స్వదేశానికి రప్పించిన జిల్లా కలెక్టర్

**అమలాపురం (మనసులోమాట) జూలై14:**

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కటికదల మరియమ్మ మస్కట్‌లో ఉపాధి నిమిత్తం వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ చొరవతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించారు. మరియమ్మ 2026 జనవరిలో ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లగా, అధిక పని గంటలు, తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. షుగర్, కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో పాటు కాళ్లు వాపు రావడం, పాదాల నుంచి చీము కారడం వంటి పరిస్థితులతో స్వదేశానికి రావాలని కోరుకున్నారు. ఆమె కుమారుడు అమలాపురం కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కెసిఎం)ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కెసి ఎం అధికారులు సంబంధిత ఏజెంట్, యజమాని, ఇతర అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టి ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించారు. విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే కార్మికులు ప్రభుత్వ అనుమతి పొందిన రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారానే వెళ్లాలని, విదేశాల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులను లేదా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి వి.



సుబ్బారావు, సమన్వయకర్త గోళ్ళ రమేష్, రెసిలయన్స్ ఫౌండేషన్ బృందం సభ్యులు కడియాల సత్తిబాబు, షేక్ బీబీ సఫియా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026కు రాజకీయ పార్టీల సహకారం అవసరం

**ఏలూరు, జూలై 14(మనసులో మాట)**

జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐర్) 2026, కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ కోరారు. మంగళవారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)2026పై సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు అడిగిన ప్రశ్నలకు, సందేహాలకు జిల్లా జాయింటు కలెక్టరు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వేని విజయవంతంగా నిర్వహించారన్నారు. ఏలూరు జిల్లాలో ప్రత్యేక విస్తృత పునశ్చరణ (ఎస్ ఐ ఆర్)2026 సంతృప్తికరంగా జరిగి, మొదటి స్థానంలో నిలిచామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో 16,44,193 మంది ఓటర్లను పర్యవేక్షించేందుకు 1,744 మంది బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓలు) ఉన్నారని అన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో గణన పత్రాల (ఈఎఫ్ ల) పంపిణీ 100% పూర్తయిందని, మొత్తం 15,54,463 గణన పత్రాలు డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. దీనితో మొత్తం 94.54% ఈ ఎఫ్ డిజిటలైజేషన్ సాధించబడిది అని అన్నారు. నియో



జకవర్గాలు వారీగా ఈఎఫ్ డిజిటలీకరణ ఈ క్రింది విధంగా ఉందని తెలిపారు. నం. 63 దెందులూరు: 95.64%,నం. 64 ఉంగుటూరు: 95.36%, నం. 65 ఏలూరు: 95.18%, నం. 70 నూజవీడు: 95.00%,No. 67 పోలవరం: 93.87%, No. 68 చింతలపూడి : 93.70%, నం. 73 కైకలూరు: 93.22% పూర్తి చేశామని తెలిపారు.



## జూలై 18 న స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

- చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి అప్పారావు

**చింతలపూడి( మనసులో మాట) జూలై 14 :**



రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై 18 న చింతలపూడి మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యం లో చింతలపూడిలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్&జూనియర్ సివిల్ జడ్జి ఏబీ అప్పారావు తెలిపారు.ఈ సందర్భంగా కోర్టులు పనిచేయు ప్రతిచోట చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకొనుటకు స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. చింతలపూడి కోర్టు పరిధిలో ఉన్న చెక్ బౌన్స్ కేసుల్లో ఉన్న వాదులు / ప్రతివాదులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకుని విలువైన సమయాన్ని డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు.చింతలపూడి కోర్టులో చెక్ బౌన్స్ కేసులు పెండింగ్ ఉన్నాయని చింతలపూడి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈ స్పెషల్ లోక్ అదాలత్ పై శ్రద్ధ తీసుకుని మీ మీ కేసులలో ఉన్న కక్షి దారులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఎక్కువ మొత్తంలో చెక్ బౌన్స్ కేసులు రాజీ చేయాలని సూచించారు.

## వరద ముంపు లంక గ్రామాల గట్లను పటిష్ట పరచండి

- అద్దంకి వారి లంక గ్రామ ప్రజా ప్రతినిధి

**మండపేట (మనసులో మాట) జూలై 14**



కపిలేశ్వరపురం మండలం లోని గౌతమీ గోదావరి పరివాహక లంక గ్రామాల ఏటి గట్లు బలహీన పడి అత్యంత ప్రమాదబరితం ఉన్నాయని, ఏటి గట్లకు గ్రోయన్లు, రిటైనింగ్ వాల్స్ వేయాలని మండలం లోని అద్దంకి వారి లంక గ్రామ ప్రజా ప్రతినిధి చెల్లె డేవిడ్ రాజ్ సీఎం చంద్రబాబు నాయుడు ని కోరారు. ధవళేశ్వరం సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ నూతన గేట్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కి వచ్చిన సందర్భంలో అయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కపిలేశ్వరపురం,అద్దంకి వారిలంక, శ్రీ రామాపురం, కోరుమిల్లి, కోరుమిల్లి లంక, కేదార్లంక, తదితర గ్రామాల్లో వరదల సమయం లో నదీ ప్రవాహానికి గట్లు కొట్టుకు పోయి ప్రమాదం గా మరాయన్నారు. ముఖ్యం గా లంక గ్రామాలు తరచూ ముంపు నకు గురవుతున్నాయన్నారు.

## డెంగ్యూ రహిత గ్రామాలు నిర్మిద్దాం

**అయినవిల్లి (మనసులో మాట) జూలై 14:**

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అయినవిల్లి పీహెచ్ సిలో డాక్టర్ మంగాదేవి ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి నివారణకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ గ్రామాలు పట్టణాల్లో డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు, పట్టణవాసులకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఇంటి లోపల బయట నీరు గుంతలు లేకుండా పాడైన బకెట్లు వాటర్ ట్యాంకులపై మూతలు లేకుండా ఉండకుండా వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దీనివలన డెంగ్యూ లార్వా వృద్ధి చెందకుండా ఉంటుందని దీంతో డెంగ్యూ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ హెచ్ ఎస్, హెల్త్ అసిస్టెంట్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## అస్సాగో పరిశ్రమను తరిమికొట్టాలి.. బాధితులనుఆదుకోవాలి

- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల మొర
- మరోతీ శివగణేష్,పాఠంశెట్టి సూర్య చంద్ర హౌస్ అరెస్టులపై ధ్వజమెత్తిన అస్సాగో బాధిత ప్రజలు
- శివ గణేష్,సూర్య చంద్రలకు అనుకూలంగా నినాదాలు

**గోకవరం (మనసులో మాట) జూలై 14:**

గోకవరం మండలం, గుమ్మళ్ళదొడ్డిలో మంగళవారం అస్సాగో బాధితులు తమ నిరసనను మరొక్కసారి వ్యక్తపరిచారు. అస్సాగో యాజమాన్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే యోచనతో చేసుకున్న దరఖాస్తుపై రాజమహేంద్రవరం ఆర్డీవో శివరాముడు నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో గుమ్మళ్ళదొడ్డి, బావాజీపేట, వెదురుపాక, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, కంపెనీ వల్ల ఇప్పటికే తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు తెలియజేశారు.

**కంపెనీ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు పై మండిపాటు**

ప్రభుత్వ అధికారులు నిర్వహించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వ స్థలాలు గాని, ప్రభుత్వ కార్యాలయాలు గాని లేవా అంటూ స్థానికులు మండిపడ్డారు. అస్సాగో కంపెనీకి సంబంధించిన పార్కింగ్ స్థలంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారులే తమ గ్రామాన్ని అస్సాగో కంపెనీకి అమ్మేశారు అనడానికి కార్యక్రమం నిర్వహణ వేదికే నిదర్శనమని స్థానిక యువత మండిపడ్డారు.

**భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి**

ఇప్పటికే నిత్యం పది లక్షల లీటర్ల వరకు నీటిని భారీ మోటార్ల సహాయంతో భూగర్భ జలాలను కంపెనీలో వినియోగిస్తున్నారని, ఫలితంగా తమ గ్రామంలో బోరు బావులు పనిచేయడం లేదని, తాగు సాగు నీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడుతుందని స్థానిక రైతులు అధికారుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు.

**నిత్యం 157 టన్నుల కార్బన్డయాక్సైడ్ ఏమవుతుంది**

ఇప్పటివరకు తయారవుతున్న ఇథనాల్ వల్ల ప్రతి రోజు సుమారు 157 టన్నుల కార్బన్డయాక్సైడ్ విడుదలవుతున్నట్లు కంపెనీ యాజమాన్యం ఒప్పుకుందని, కానీ ఈ కార్బన్ డయాక్సైడ్ ను పరిసర ప్రాంతాల్లోనే విడిచిపెట్టడం తీవ్ర భయాందోళనకు గురిచేస్తుందని గ్రామస్తులు అధికారులకు వివరించారు. కంపెనీని మరింత విస్తరింప చేస్తే వాయు కాలుష్యంతో పరిసర ప్రాంతం క్యాన్సర్ కారక రోగాలతో నిత్యం మరణాలు సంభవిస్తాయని విద్యావేత్తలు అభిప్రాయం పడ్డారు.

**భారీ శబ్దాలతో భయభ్రాంతులకు గురవుతున్నాము**

రాత్రి సమయంలో కంపెనీ నుండి వస్తున్న భారీ శబ్దాల వల్ల తీవ్ర భయాందోళన గురవుతున్నామని, చిన్నారులు నిద్రపోకుండా ఏడుస్తున్నారని కంపెనీ సమీపంలోని దళిత పేటకు చెందిన మహిళలు అధికారులకు తెలియజేశారు.

**పోలీసుల తీరు పై విమర్శలు**

ఒకపక్క అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చి, తమ అభిప్రాయాలను తెలియజేయాలని ప్రచారం చేస్తే, పోలీసులు మాత్రం దౌర్జన్యంగా జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతీ శివ గణేష్, పాఠంశెట్టి సూర్యచంద్ర, తదితరులను హౌస్ అరెస్టులు చేయడంపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో పోలీసులను తప్పుపట్టారు. ప్రజాస్వామ్యంలో ఉన్న తమకు తమ సమస్యలను అధికారులకు తెలియజేసుకునే భావ ప్రకటన స్వేచ్ఛ కూడా లేకుండా పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా స్థానికులపై కేసులు పెట్టి బెదిరింపు ధరణిలో పోలీసుల వ్యవహార శైలిని గ్రామస్తులు వ్యతిరేకించారు.

**స్మశానంలో 30మంది కి ఉద్యోగాలు**

కేవలం ఒకరిద్దరి లాభాల కోసం, నాలుగు గ్రామాలను స్మశానాలుగా మార్చి, 30 మందికి ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పడం చాలా దారుణమని స్థానికులు అధికారులకు తెలిపారు. ఐవోసీఎల్, హెచ్పిసిఎల్ ప్లాంట్లను ఆనుకొని నిత్యం నిప్పుల కొలిమితో ఉండే ఇథనాల్ ప్లాంట్ కు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారని, ఆర్డీవో శివరాముడిని స్థానికులు ప్రశ్నించారు.

**దశలవారీగా ఉద్యమం ప్రారంభం**

ఇప్పటికే ఉన్న కంపెనీ వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ కంపెనీని ఇక్కడి నుండి తరలించడానికి త్వరలో దశలవారీగా ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తామని, కంపెనీ సామర్థ్యాన్ని పెంచడానికి ఏ విధమైన అనుమతులు ఇవ్వకూడదని అధికారులకు తెలియజేశారు.

## పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి, యువత సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ

**మండపేట (మనసులో మాట) జూలై 14**




రాష్ట్రంలో పర్యాటక, సాంస్కృతిక రంగాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు, యువత సాధికారతకు మరియు నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాల్ 1 లో మంగళవారం మధ్యాహ్నం యువజన పురోభివృద్ధి, పర్యాటక సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర అంచనాల కమిటీ సమీక్షా సమావేశం కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా శాఖల పురోగతి, నిధుల వినియోగంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసి ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని, మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాలని సూచించారు. అదేవిధంగా యువతలోని సృజనాత్మకతకు పదును పెట్టేలా, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా వినూత్న కార్యక్రమాలను రూపొందించాలని స్పష్టం చేశారు. కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో, పారదర్శకంగా వినియోగిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గూడూరు ఎమ్మెల్యే పాసం సునీల్ కుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి, ఐఎఫ్ఎస్, యువజన పురోభివృద్ధి, పర్యాటక & సాంస్కృతిక శాఖ డిప్యూటీ సెక్రటరీ టి. వి. సావిత్రి దేవి, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.ఎ.ఎల్. పద్మవతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నరు.

## వైభవంగా శ్రీ మావుళ్ళమ్మ తల్లి జాతర

**మండపేట (మనసులో మాట ) జూలై 14**

మారేడుబాక గ్రామంలో వెలసిన శ్రీ మావుళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ముగిసాయి. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో ఉత్సవాలు ప్రశాంతంగా సాగాయి. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా గరగల నృత్యం, తీన్మార్ డప్పుల మోతలు, సాంప్రదాయ నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాల హోరు మధ్య భక్తులు భక్తిభావంతో నాట్యాలు చేస్తూ తన్మయత్వానికి లోనయ్యారు. మంగళ వారం అమ్మవారికి ఉయ్యాల ఊపు సేవ నిర్వహించారు. మంగళవాయిద్యాలు, డోలు సన్నాయిల నడుమ అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు మారేడుబాక గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు.



# తుమ్మలపల్లి రమేష్ సొంత ఖర్చులతో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణ

- ప్రతి మంగళవారం పేదలకు అన్నదానం

**జగ్గంపేట,(మనసులో మాట) జూలై 14:**

జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 500 మంది నిరుపేదలు, దినసరి కూలీలు, ప్రయాణికులు అవసరమైన వారికి ఉచిత భోజనం



అందించారు.ఈ సేవా కార్యక్రమానికి అయ్యే పూర్తి వ్యయాన్ని తుమ్మలపల్లి రమేష్ తన సొంత నిధులను వెచ్చిస్తున్నారు.జనసేన పార్టీ అధ్యక్షుడు , ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని గత రెండేళ్లుగా ప్రతి మంగళవారం ఎలాంటి విరామం లేకుండా డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.ఈరోజు ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ప్రారంభించి స్వయంగా భోజనం వడ్డించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజా సేవే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ మా నాయకులు తుమ్మలపల్లి రమేష్ కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఉద్యాన పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణా కార్యక్రమం

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 14 :**

కాకినాడ జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గోవిందపురం మల్లిసాల గ్రామాలలో మామిడి, జీడీమామిడి మరియు ఆయిల్ పామ్ పంటలలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై ఒకరోజు రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ అధికారి ఎ. శ్రీవల్లి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ ఎన్ఐ ఆర్సీఏ కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్లకు చెందిన ఎన్. రఘునందన్, ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రొటెక్షన్ శాస్త్రవేత్తగా పాల్గొన్నారు. మామిడి జీడిమామిడి పంటలలో కోత అనంతర కేనోపీ నిర్వహణ, పోషక యాజమాన్యం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేల సారాన్ని పెంపొందించడంలో జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ పామ్ పంటలో సమగ్ర పోషక యాజమాన్యం, ఎరువులు మరియు సూక్ష్మపోషకాలను సరైన సమయంలో వేయడం, వేసిన ఎరువులను మట్టితో



కప్పడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, మొక్కల సంరక్షణ చర్యలు, అలాగే ఎల్ నినో పరిస్థితుల్లో పంటలను సంరక్షించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు.ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. నీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డ్రిప్ సేద్యాన్ని సమర్థవంతంగా వినియోగించడం, మల్చింగ్ చేపట్టడం, నేలలో తేమను నిల్వ ఉంచడం, సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచడం, సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించడం, సూక్ష్మ



పోషకాలను సిఫార్సుల మేరకు వినియోగించడం, ఎండ తీవ్రతను తట్టుకునేలా మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను అనుసరించి సాగు నిర్వహణ చేపట్టడం ద్వారా ఎల్ నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, ముంద్రు ఎర్రబాబు, కమ్మిల వెంకటేశ్వరరావు, నాని రాజు, కానమరెడ్డి రామకృష్ణ ఎంపీటీసీ, గోవిందాపురం గ్రామ నాయకులు కొల్లు రామకృష్ణ, గ్రామ నాయకులు ముంద్రు కృష్ణారావు, ఉద్యాన శాఖ సిబ్బంది, ఉద్యాన సహాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమ విస్తరణను అడ్డుకుంటాం
- పాటంశెట్టి సూర్యచంద్ర

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 14**



జగ్గంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ అండదండలతో స్థానిక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ సాగుతున్న అరాచక పాలనపై తక్షణమే చర్యలు చేపట్టాలని సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గోకవరం మండలం, గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 2 లక్షల లీటర్ల నుండి 3 లక్షల లీటర్ల తయారీ పెంచేందుకు నేడు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ (గ్రామసభ) కేవలం ఒక ప్రహసనంగా మారిందన్నారు.ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకను వినిపించడానికి సిద్ధమైన మమ్మల్ని పోలీసు బలగాలతో నిర్బంధించిన దుర్మార్గమైన చర్యని పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్రంగా ఖండించారు.ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో మాట్లాడే కనీస హక్కును కూడా నిరాకరిస్తూ, పోలీసులను అడ్డుపెట్టుకుని సభను జరపడం ఎంతవరకు సమంజసం? మేమేమీ తీవ్రవాదులం కాదు, చట్టాన్ని గౌరవించే పౌరులం. మా గొంతు నొక్కడం ద్వారా ప్రభుత్వం ఏ అరాచకాన్ని దాచాలని చూస్తోందని ప్రభుత్వాన్ని సూర్యచంద్ర ప్రశ్నించారు.

ఇప్పటికే ఉన్న పరిశ్రమ వల్ల శబ్ద, వాయు, జల కాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. ఒక లీటర్ ఇథనాల్ తయారీకి ఏకంగా 5 లీటర్ల భూగర్భ జలాలు అవసరమవుతున్నాయి. అంటే నిత్యం సుమారు 15 లక్షల లీటర్ల నీటిని తోడేస్తూ ఉంటే, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో వ్యవసాయం నిర్వీర్యమై, తాగునీటి కటకట ఏర్పడటం ఖాయమన్నారు.నిత్యం సుమారు 225 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ప్రమాదకరమైన కాలుష్యం గాలిలోకి విడుదలవుతుండటం వల్ల వాతావరణం కలుషితమై స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.నాడు ఎన్నికల ప్రచారంలో "ఈ ఫ్యాక్టరీని రద్దు చేస్తాం" అని ప్రగల్భాలు పలికిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జ్యోతుల నవీన్ ఎక్కడికి వెళ్లారన్నారు, ప్రజలు ఇంతగా అల్లాడుతుంటే, తిరుపతిలో బోర్డు మీటింగ్ ఉందంటూ తప్పించుకుపోవడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటన్నారు.అస్సాగో యాజమాన్యం నుండి ఎన్ని కోట్లు ముట్టాయని ఈరోజు ఈ రకమైన పారిపోకడలకు పాల్పడుతున్నారని సూర్యచంద్ర ప్రశ్నించారు.



# "సర్ " పొడిగించాలంటూ వినతిపత్రం

**నిడదవోలు (మనసులో మాట) జూలై 14**

ఎస్ఐఆర్ (సర్) నెలరోజులు పాటు పొడిగించాలని సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు 9 కమిటీ తరపున నిడదవోలు ఎమ్మార్వో బి. నాగరాజు నాయక్ కు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ఏ ఒక్కరి ఓటు తొలగించమని పారదర్శంగా సర్ ప్రక్రియ జరుగుతుందని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఈరోజు తో సర్ ప్రక్రియ నూరు శాతం పూర్తికాలేదు అని ప్రక్రియలో ప్రజలు ఎదుర్కుంటున్న తీవ్ర సమస్యలు గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని నిబంధనలు సడలించాలని ఉదా! ప్రజల వద్ద నిత్యం అందుబాటులో ఉండే అత్యంత ప్రామాణిక పత్రాలైన ఆధార్ కార్డు,ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిని ఈ వెరిఫికేషన్ ప్రక్రియకు ప్రాతిపదికగా తీసుకోవడంలేదని. చట్ట బద్ధమైన ఈ కార్డులను కాదని ఇతర పత్రాలు అడగటం వల్ల సామాన్య ప్రజలు నిరక్షరాస్యులు తీవ్ర గందరగోళానికి ఇబ్బందులకు గురవుతున్నారని నిబంధనలు పేరుతో విద్యార్హత. పాస్పోర్ట్ కుల లేదా జనన ధ్రువీకరణ పత్రాలను అధికారులు తప్పని సరిగా కోరుతున్నారని జువ్వల రాంబాబు వినతి పత్రంలో కోరారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పాదయాత్ర

- ఎమ్మెల్యే పంతం నానాజీ సర్పవరం నుంచి పాదగయ వరకు పాదయాత్ర

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**

జనసేన పార్టీ అధ్యక్షుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముంబైలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు, పాదయాత్ర నిర్వహించారు.ముందుగా సర్పవరం జంక్షన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాకినాడ రూరల్ నియోజకవర్గం లోని వివిధ గ్రామాలు, డివిజన్లకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులు,వీరమహిళలతో కలిసి ఆయన తనయుడు పంతం సందీప్ సర్పవరం నుంచి పిఠాపురంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాదగయ వరకు పాదయాత్ర చేపట్టారు.పాదయాత్ర ముగిసిన అనంతరం పాదగయలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా పంతం సందీప్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలు కోవాలని ఆకాంక్షిస్తూ జనసైనికులు,వీరమహిళలతో కలిసి ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ప్రార్థించినట్లు చెప్పారు.





# మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

- అడబాల బాబ్జి...

మండపేట (మనసులో మాట) జూలై 14



ప్రజాస్వామ్యంలో ప్రజలను పరామర్శించే హక్కు అందరికీ ఉంటుందని మండపేట రూరల్ వైసిపి కన్వీనర్ అడబాల బాబ్జి స్పష్టం చేశారు. రామవరం కుతుకులూరు కార్యకర్తలపై కూటమి ప్రభుత్వ కార్యకర్తలు దాడి చేసిన విషయాన్ని తెలుసుకున్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి పరామర్శించడానికి వెళ్లారన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కూటమి ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయించి పోలీస్ స్టేషన్లను మార్చి మార్చి తిప్పడం హేతుబద్ధమైన, కక్షపూరిత చర్యని మండిపడ్డారు. దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఖండిస్తున్నాయని మండపేట మండల రూరల్ వైసిపి కన్వీనర్ అడబాల బాబ్జి పేర్కొన్నారు. తన కార్యకర్తలకు అన్యాయం జరిగిందని పరామర్శ కు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో కక్షపూరిత చర్యలతో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. కూటమి చర్యలకు తగిన రీతిలో బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

## ముద్రగడ త్వరగా కోలుకోవాలి

- కిర్లంపూడి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో మృత్యుంజయ హోమం

కిర్లంపూడి (మనసులో మాట) జూలై 14:

మాజీ మంత్రి,వైసీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ కిర్లంపూడి గ్రామం సంత మార్కెట్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మృత్యుంజయ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకుడు బాదంపూడి ప్రసాద్ శర్మ, పిరాట్ల వెంకట శాస్త్రి, శ్రీ సూర్య దత్త తదితర వేద పండితుల బృందం మంత్రోచ్ఛారణల మధ్య హోమాన్ని నిర్వహించారు.

# అదనపు యూనిట్ కి అనుమతులు కాదు

- అసలు పరిశ్రమనే ఇక్కడి నుండి తరలించాలి
- ప్రజల ప్రాణాలను కాపాడాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకు వీరాంజనేయులు డిమాండ్



గోకవరం (మనసులో మాట) జూలై 14:

అస్సాగో ఇథనాల్ పరిశ్రమ విస్తరణకు అనుమతులు నేపథ్యంలో గోకవరం మండలం గుమ్మళ దొడ్డి గ్రామంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ మీటింగ్ కు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం , ఏఐఎఫ్ టు యు, ప్రగతిశీల మహిళా సంఘం ( స్త్రీ విముక్తి), పి డిఎస్యు (విజృంభణ) ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాన్ని రిప్రజెంటేషన్ ద్వారా ఇవ్వడం జరిగింది. ప్రజా సంఘాల ఐక్యవేదిక తరపున ఏపీఆర్సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు ప్రజల తరపున పరిశ్రమ నిర్మాణం పై అభిప్రాయాన్ని సూటిగా చెప్పారు. అనంతరం ప్రజలు పెద్ద ఎత్తున ఉద్వేగ భరితంగా" అస్సాగో వద్దు, ప్రాణాలే ముద్దు" అంటూ ప్రజలు నినదించారు. అనంతరం సభను బాయ్ కట్ చేసి ఒకేసారి ప్రజలందరూ సభ వేదిక నుండి బయటకు వచ్చి పెద్ద ఎత్తున అస్సాగో పరిశ్రమకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు వీరాంజనేయులు మాట్లాడుతూ ఉన్న ఫ్యాక్టరీ తోనే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, కొత్తగా రెండు లక్షల నుండి మూడు లక్షల లీటర్ల ఆల్కహాల్ సామర్థ్యాన్ని పెంచడానికి అనుమతులు కోరడం దారుణం అన్నారు.

ఇప్పటికే గుమ్మళ దొడ్డి, వెదురుపాక, అచ్చుతాపురం, బాబాజీ పేట గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయి, సాగునీరు, తాగునీరు అందక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శబ్ద కాలుష్యం, గాలి, నేల కలుషితమైపోయి, దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఉన్న పరిశ్రమతోనే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు కొత్తగా మరో యూనిట్ను నిర్మాణం చేయడానికి ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిలవవలసిన ప్రభుత్వాలు పోలీస్ బలంతో ప్రజని భయాందోళనకు గురిచేసి ప్రజల తరపున పోరాడుతున్న నాయకులను హౌస్ అరెస్టులు చేసి, ప్రజలకు సరైన సమాచారం లేకుండా కంపెనీకి దగ్గరలో ప్రజాభిప్రాయ సేకరణ మీటింగ్ పెట్టి నాంకః కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. అయినప్పటికీ సమాచారం తెలుసుకున్న ప్రజలు మీటింగ్ ప్రాంతానికి చేరుకుని ముక్తకంఠంతో అస్సాగో పరిశ్రమను వ్యతిరేకించారు. ఈ ఇథనాల్ పరిశ్రమ వలన ఆహార భద్రత దెబ్బతింటుందన్నారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతీసే కాలుష్యకారక అస్సాగో పరిశ్రమను అక్కడ నుండి తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల్ని సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్సిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్ టు యు జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) నాయకులు రెడ్డి దుర్గాదేవి, పిడిఎస్యు (విజృంభణ) రాష్ట్ర కన్వీనర్ కడితి సతీష్, ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా నాయకులు కే రామలింగేశ్వరరావు, డాన్ శ్రీను, వెంకట్ తదితరులు ప్రతినిధులుగా పాల్గొన్నారు.




# ఏలేశ్వరం పట్టణం కప్పల చెరువు వద్ద ఇష్టారాజ్యంగా గోవధలు

- ఓ సమాజమా కళ్ళు మూసుకో...?

ఏలేశ్వరం (మనసులో మాట) జూలై 14

ఏలేశ్వరం మున్సిపాలిటీలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టా రాజ్యంగా పబ్లిక్ గా గోవధలు చేయడం పట్ల స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళ వారం పట్టణం లో సుందరమైన పార్క్ నిర్మాణానికి ప్రభుత్వ ఉన్నదాధికారులు కప్పల చెరువును గుర్తించడం జరిగింది. ఎందుకు సంబంధించి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ పార్కు నిర్మాణానికి కూడా ఇటీవల శంకుస్థాపన చేసారు . కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పార్కు చుట్టూ గోవధలు చేయడం ఆ చుట్టుపక్కనున్న ప్రజలకు ఆ రహదారి పక్కన వెళ్లే వారికి తీవ్ర భయంకరమైన దృశ్యాలను చూడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది . కప్పల చెరువు ని ఇటీవల ఏలేశ్వరం మున్సిపల్ అధికారులు పరిశుభ్రం చేసి దాన్ని ఒక అందమైన సుందరమైన పార్కుగా రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.అలాంటి పార్కు కొంతమంది స్వార్థపరులు తమ ఇస్తారాజ్యముగా పశువధ చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆ పార్కు గోవధలను నిర్వహిస్తూ చుట్టూ రక్తన్ని ఏరులై వారే విధంగా అక్రమ గోమాంస విక్రయదారులు ఇష్టరాజ్యంగా గోవులను



వధిస్తున్నారు . దీంతో ఆ ప్రాంతమంతా గుపక్షాకారం మారిందిి. ఇది చాలదన్నట్లు ఎస్సీ వార్డులో గో మాంస విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. కప్పల చెరువు పార్కు చుట్టూ జరుగుతున్న బహిరంగ గోవధలను నిషేధించాలని గత వారం రోజులుగా ప్రజలు విన్నవించు కుంటున్నారు. అయినా మున్సిపల్ శాఖ అధికారులు కనీసం కన్నెత్తైనా చూడకపోవడంతో ఇలాంటి సంఘటన చోటుచేసుకుంటున్నాయి.గోవధకు ముందు ఆ గోవుల ఆరోగ్యంగా ఉన్నాయా లేదా చూడాలి వాటిని స్థానికంగా ఉన్న పశు వైద్య శాలలో పరీక్షలు నిర్వహించాలి.అనంతరం దానిని వధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది. ఎక్కడపడితే అక్కడ పబ్లిక్ గా గోవధ చేయడం నేరమైన విషయమైనా సరే నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మున్సిపల్ అధికారులకు చేతులు తడిపి ఎవడేం పీక్కుంటాడో అనే స్థాయికి కసాయివారు వచ్చారంటే వారికి ఎవరు కొమ్ముకాస్తున్నారు ఒక్కసారి ఆలోచన చేయాలని ఏ దేశం ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయి లో పరిశీలన చేసి గోవులను వధిస్తున్న వారిని పట్టుకునే ప్రయత్నాలు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది . పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వస్తున్నారని ముందుగానే సమాచారం తెలుసుకున్న తెలుసుకొన్న గోవధల నిర్వాహకుడు ఆ ప్రాంతం నుండి పారిపోవడం మంగళవారం జరిగింది.

# కోనసీమ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 99 శాతం పూర్తి

- **కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్**




**అమలాపురం(మనసులోమాట) జూలై 14 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ 99 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితాను సంపూర్ణంగా, పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఓటరు చురుకుగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

మంగళవారం అమలాపురంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల శాఖ అధికారులతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యక్రమం పురోగతిని కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, పి. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తిగా (100 శాతం) ముగిసిందన్నారు. అలాగే కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు మండలాల్లో కూడా ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. అయితే ఆత్రేయపురం మండలంలో మాత్రమే ఇంకా స్వల్పంగా పని మిగిలి ఉందన్నారు. మొత్తం 54,769 మంది ఓటర్లలో 54,550 మంది వివరాల సేకరణ పూర్తయిందని, మరో 219 మంది ఓటర్ల వివరాలను నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. దీంతో ఆ మండలంలో 99 శాతం ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోందని, అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దుతున్నట్లు చెప్పారు.

ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒక్క అర్హుడూ ఓటర్ల జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా చూడడం, అర్హత లేని పేర్లను తొలగించడం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. అందుకే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తిగా నింపి వెంటనే తిరిగి అందజేయాలని ఆయన కోరారు. సరైన సమాచారం అందించినప్పుడే ఓటర్ల జాబితా ఖచ్చితంగా రూపొందుతుందని, తద్వారా ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించబడుతుందని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా భద్రత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయడానికే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, బీఎల్‌వోలకు సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఇంటిటీ ఫీవర్ సర్వేలు



**వి.ఆర్.పురం(మనసులోమాట) జూలై 14;** మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో జ్వరాలు అధికంగా వ్యాపించి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, రేఖపల్లి ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఇంటింటి జ్వరాల సర్వేలను నిర్వహించారు. రేకపల్లి పీహెచ్సీ పరిధిలోని సోడే పహాడ్, దర్భలంక, సున్నం మక్కా, వెంకంపాలెం గ్రామాల్లో డాక్టర్ నీలు ఫర్, డాక్టర్ పృథ్వీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేసి, కేసులను గుర్తించి వారికి ఆర్డిటి టెస్టులను చేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు డెంగు మలేరియా వైరల్ జ్వరాలు తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. యధావిధిగా ఉమ్మడివరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహణ, ఓడోమస్ ఆయింట్మెంట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ భద్రకాళి, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాపు నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

**కాకినాడ (మనసులో మాట) జులై 14**




వైఎస్ఆర్సిపి నాయకుడు కాపు ఉద్యమనేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మంగళవారం సాయంత్రం సుమారు 6:30 గంటలకు హైదరాబాదులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. గత నెల రోజులుగా ఆయన అనారోగ్యం తో హైదరాబాద్‌లోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం కన్నుమూశారు. 1953 లో తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి లో జన్మించిన ముద్రగడ గత కొంత కాలంగా శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందిపడుతున్నారు. ముద్రగడ పద్మనాభం ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందారు.

1978లో తొలిసారి జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యే గా గెలిచారు. 1989 వరకు వరుసగా 4 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దివంగత నేతలు ఎన్టీఆర్,మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. 2024 ఎన్నికల ముందు వైఎస్సార్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ముద్రగడ పద్మనాభం తనయుడు ముద్రగడ గిరిబాబు వైఎస్ఆర్సిపి పార్టీ తరపున ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ గా పనిచేస్తున్నారు. ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ప్రత్తిపాడు నియోజకవర్గం లోని వైసీపీ శ్రేణుల్లోను కిర్లంపూడి లో విషాద స్థాయిలనుకున్నాయి

# ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాధితురాలికి ఎల్ వో సి మంజూరు

- **జ్యోతుల నవీన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేత**

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 14:**




రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,జగ్గంపేట మండలం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా జగ్గంపేట నియోజకవర్గం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి వీరబాబు కుమార్తె మాదిరెడ్డి హేమలతకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ వో సి ఆర్థిక సహాయ పత్రాన్ని అందజేయడం జరిగింది.హేమలత బోన్ టీబీ వ్యాధితో బాధపడుతూ అత్యవసరంగా ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న కాట్రావులపల్లి గ్రామానికి చెందిన గ్రామ టిడిపి అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరావు వెంటనే స్పందించి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వద్దకు వెళ్లి విషయాన్ని తెలియజేసి సిఫారసు లేఖపై సంతకం చేయించారు. అనంతరం విజయవాడ వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రెండు లక్షల అరవై వేల మూడు వందల ఎనభై తొమ్మిది రూపాయల లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయించి రాత్రికి తీసుకువచ్చారు.మంగళవారం ఆ లెటర్ ఆఫ్ క్రెడిట్ ను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా బాధితురాలి కుటుంబానికి అందజేశారు. ఈ సహాయంతో కాకినాడ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ లో హేమలతకు చికిత్స అందించనున్నారు.ఈ సందర్భంగా ముసిరెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలను తీర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎల్లవేళలా ముందుంటారని, అవసరమైన ప్రతి ఒక్కరికీ ఇదే విధంగా సహాయం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# లింగంపత్తిలో పిచ్చికుక్క కరచిన ఏడేళ్ల బాలుడు మృతి

- **28 మంది గాయాలు**

**ఏలేశ్వరం (మనసులో మాట) జూలై 14**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలానికి చెందిన లింగంపర్తి గ్రామం లోని సత్ర పంపు వీధిలో గత జూన్ నెల 14 వ తేదీన పిచ్చికుక్క మనుషులపైన పశువుల పైన దాడి చేసి సుమారు 28 మందిని కరిచింది. ఈ ఘటనలో బిశెట్టి లక్ష్మణ్ దుర్గ దంపతులకు ప్రథమ కుమారుడు సాయి గణేష్ (7) ను కూడ ఆ పిచ్చి కుక్క కరువగా వెంటనే ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి లో అతనికి వ్యాక్సిన్స్ కూడా వేయించారు. గత మూడు రోజుల క్రితం ఆ బాలుడు మాట తడబడడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జి జి హెచ్ కు తరలించగా మంగళవారం ఆ (ఏడు సంవత్సరాల) బాలుడు సాయి గణేష్ మృతి చెందాడు. ఈ ఘటనతో లింగంపర్తి గ్రామంలో కుటుంబ సభ్యుల రోధనలతో విషాదఛాయలు అలుముకున్నాయి . అలాగే పిచ్చికుక్క కరిసిన ఒక లేగ దూడ మరణించింది. అయితే పిచ్చికుక్క కరిచిన మిగిలిన 27 మందికి అబ్జర్వేషన్ పెట్టి మెరుగైన వైద్యం అందించాలంటూ ప్రజలు కోరు కుంటున్నారు. ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో విచ్చల విడిగా తిరుగుతున్న కుక్కలను పట్టుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ మండలంలోని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



# జూలై 19 వ తేది నుండి ఏలేరు రిజర్వాయర్ ద్వారా 53 వేల ఎకరాలకు సాగునీటి విడుదల

- **జిల్లాలో ఎరువుల కొరత లేదు**
- **జూలై నెలకు సరిపడా యూరియా పూర్తిగా సిద్ధంగా ఉంది**
- **ఇంటింటి ఓటర్ల సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు**
- **జూలై 31వ తేదిన డ్రాఫ్ట్ ప్రచురణ**
- **కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**

**కాకినాడ (మనసులో మాట) జూలై 14:**



కాకినాడ జిల్లాలో ఖరీఫ్ పంట సాగుకు రైతులు ముమ్మరంగా సిద్ధమవుతున్న తరుణంలో, వారికి అవసరమైన సాగునీటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షపాతం సాధారణం కంటే 25 శాతం తక్కువగా నమోదైనప్పటికీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సాగునీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న 8.68 టీఎంసీల నీటిని గోదావరి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఆగ్మెంట్ చేస్తూ,జూలై 19వ తేదీ నుండి ఏలేరు కింద ఉన్న 53 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీటి విడుదల ప్రారంభించ నున్నట్లు ప్రకటించారు. పీబీసీ, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 20 వేల ఎకరాలకు ఇప్పటికే నీటి సరఫరా మొదలైందని,సామర్లకోట వద్ద ప్రస్తుతం అందుతున్న 300 క్యూసెక్స్ నీటిని మరింత పెంచి,శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.
ధవళేశ్వరం నుండి ఇప్పటికే 4,900 క్యూసెక్స్ నీటిని డ్రా చేస్తున్నందున, రాబోయే ఒకటి రెండు రోజుల్లో ఆర్ఆర్‌బీ ట్యాంక్ కింద ఉన్న 10 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందుతుందని, అలాగే తిమ్మరాజు ట్యాంక్‌కు జూలై 19 నుండి 50 క్యూసెక్స్ నీటిని విడుదల చేస్తామని కలెక్టర్ వివరించారు.పంపా పరిధిలోని 8,985 ఎకరాలకు ఆగస్టు మొదటి వారంలో నీరు ఇవ్వడం జరుగుతుందని, తాండవాకు సంబంధించి త్వరలోనే పొరుగు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి నిర్ణయం ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.
జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల కొరత ఎక్కడా లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను రైతులు నమ్మవద్దని కలెక్టర్ కోరారు.జిల్లాకు ఈ ఖరీఫ్ మొత్తానికి 57,920 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా,ఇప్పటికే 40,749 మెట్రిక్ టన్నులను సరఫరా చేశామన్నారు.
ముఖ్యంగా జూలై నెల యూరియా అవసరం 16,943 మెట్రిక్ టన్నులు కాగా, అంతకంటే అదనంగా 21,034 మెట్రిక్ టన్నులను ఇప్పటికే రైతులకు పంపిణీ చేశామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రవేశపెట్టిన 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్' (ఎఫ్ఎఫ్ఎస్) మొబైల్ యాప్ ద్వారా జిల్లాలో ఎరువుల పంపిణీ విజయవంతంగా జరుగుతోందని,యాప్ వాడకంపై అనుమానాలుంటే ఆర్ఎస్‌కే సిబ్బంది లేదా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులకు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియా అందజేస్తున్నామని, రైతులు ఎరువులను ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువకు కొనుగోలు చేయవద్దని,ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.
అలాగే రైతులు డీఏపీకి ప్రత్యామ్నాయంగా టీఎస్‌పీ (ట్రై సూపర్ ఫాస్ఫేట్) వాడాలని కోరారు.
కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్)గడువును పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జూలై 14వ తేది తో ముగియాల్సిన 'బీఎల్ఓల ఇంటింటి సర్వే' గడువును జూలై 24, 2026 వరకు పొడిగించడం జరిగిందన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు బీఎల్ఓలు గుర్తించినప్పటికీ తాము ఇంకా అదే ప్రాంతంలో నివసిస్తున్నామని భావించే అర్హులు ఎవరైనా ఉంటే, తగిన ఆధారాలతో కూడిన ఎన్యుమరేషన్ ఫామ్‌ను బీఎల్ఓలకు అందజేసి తమ పేరును నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.జూలై 31వ తేది న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని,డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత ప్రతి ఒక్కరు తమ పోలింగ్ కేంద్రంలో వారి పేరు సరిచూసుకోవాలని, పేరు లేని పక్షంలో ఏఈఆర్ఓ లేదా ఈఆర్ఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 3, 2026 న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని, అందులో పేరున్న వారికే ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేశారు.రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటే మండలాధికారులతో ఏర్పాటు చేసిన రెవెన్యూ, ఇరిగేషన్,వ్యవసాయ శాఖల సమన్వయ కమిటీలను సంప్రదించాలని కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈ సందర్భంగా కోరారు

## మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత



1.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు.
2.1978లో జనతా పార్టీ తరపున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
3.వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజల మద్దతు పొందారు.
4.ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.
5.కాపు రిజర్వేషన్ల ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు.
6.2024 ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
7.శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పలు మార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఒకసారి ఎంపీగా పని చేసిన ముద్రగడ

## చినుకు పడదు... సాగునీరు పారదు

- **నీరందక ఎండిపోతున్న నారుమళ్లు**
- **రైతుల్లో ఆందోళన**

**కాజులూరు (మనసులో మాట) జూలై 14**

ఒకవైపు వర్షాలు కురవక, మరోవైపు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారుమళ్లు వేసి దాదాపు 30 రోజులు గడిచినా ఇప్పటికీ పొలాలకు నీరు అందకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో నారుమళ్లు ఎండిపోతుండగా, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 10 శాతం కూడా తూర్పులు సాగలేదనీ రైతులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లోనైనా సాగునీరు అందకపోతే నారుమళ్లన్నీ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నారు వేయాల్సిన పరిస్థితి వస్తే అదనపు ఖర్చుతో పాటు సాగు పూర్తిగా ఆలస్యం అవుతుందని అంటున్నారు.



ప్రతి ఏడాది ఈ సమయానికి కాలువల్లో సాగునీరు ప్రవహించి వరి నాట్లు ప్రారంభమయ్యేవి. అయితే ఈసారి కాలువలకు నీరు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు కూడా రైతుల ఆందోళనను మరింత పెంచుతున్నాయి.
ఇక వరి నాట్ల కోసం దూర ప్రాంతాలైన పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలు పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. సాగునీరు రాకపోవడంతో నాట్లు ప్రారంభం కాకపోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కూడా కూలీలను పనిలో పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.
రైతులు, వ్యవసాయ కార్మికులు వెంటనే సాగునీరు విడుదల చేసి ఖరీఫ్ సాగును కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సంబంధిత అధికారులు పరిస్థితిని సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతులకు భారీ నష్టం తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది.

## కాకినాడ గేట్ వే పోర్టు పేరును కోన గేట్ వే ఫోర్ట్ గా మార్చాలి.

- **రైతుల త్యాగాలు కోన ప్రాంత ప్రజల మనోభావాలు పరిగణనలోకి తీసుకోవాలి.**
- **సీఎం చంద్రబాబు కు యనమల లేఖ.**

**తుని (మనసులో మాట) జూలై 14**

రైతుల త్యాగాలు,కోన ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా కాకినాడ గేట్‌వే
పోర్ట్ మార్పు చేయాలని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రభుత్వాన్ని కోరారు.
ఈమేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లేఖ ద్వారా రిప్రజెంటేషన్ చేసిన యనమల కాకినాడ గేట్ వే పోర్ట్ పేరును కోన గేట్ వే పోర్ట్ గా మార్పు చేసి కోన ప్రాంత రైతాంగం
త్యాగానికి గుర్తింపు ఇచ్చినట్టు అవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.కోనలో కార్యకలాపాలకు సిద్ధ పడుతున్న ఓడరేవును అరబిందో గ్రూప్ నకు చెందిన కాకినాడ గేట్ వే పోర్ట్ లిమిటెడ్ అభివృద్ధి పర్చడాన్ని
స్వాగతించిన యనమల ఈ ప్రాజెక్టు కోసం ఏపీఐఐసీ ద్వారా భూసేకరణ చట్టం 2013 కింద తొండంగి మండల పరిధిలో గల సుమారు 1600ఎకరాల భూమిని సేకరించిందని, కేఎస్ ఈజడ్ పేరుతో సమగ్ర మౌళిక సదుపాయాల ప్రాజెక్టు కోసం కోన ప్రాంతంలోపది వేల ఎకరాల వ్యవసాయ భూములను వదలుకున్నరైతాంగం గొప్ప త్యాగం చేసారని యనమల తన లేఖలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఓడరేవు మార్పును కోరుతున్న యనమల ఇందుకు రెండు ప్రధాన కారణాలను తన లేఖలో వ్యక్తీకరించారు.కాకినాడ గేట్ వే పోర్ట్ భౌగోళికంగా తొండంగి మండలంలోని కోన ప్రాంతంలో ఉందని పోర్ట్ కోసం తమ భూములను త్యాగం చేసిన రైతుల పేరుతో ఓడ రేవుకు నామకరణం చేయడం ఎంతైనా సముచితమని,దీనికి కోన గేట్ వే పోర్ట్ అని మార్చడం
రైతుల త్యాగానికి గుర్తింపు ఇచ్చినట్టు
అవుతుందని యనమల అభిప్రాయ పడ్డారు.తద్వారా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పట్ల కోన ప్రాంత ప్రజలకు యాజమాన్య భావన కల్పించినట్టు అవుతుందని దీని ద్వారా కోన రైతు గర్వాన్ని కలిగిస్తుందని యనమల పేర్కొన్నారు.
కాకినాడ సీ పోర్ట్,
కాకినాడ గేట్ వే పోర్ట్ ఒకే పోలికతో రెండు పేర్లు ఉండడం వల్ల ఈసారూప్యత ప్రజలు, వాణిజ్య సంస్థలు, లాజిస్టిక్స్ నిర్వాహకుల మధ్య గణనీయమైన గందరగోళానికి దారి తీసే పరిస్థితులు కనబడుతున్న విషయాన్ని యనమల తన లేఖ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.కొత్త ఓడరేవుకు
కోన గేట్ వే గా మార్చడం ద్వారా ఇప్పటికే కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ నుండి దీనిని స్పష్టంగా
మార్పు చేయవచ్చని సూచించిన
యనమల రామకృష్ణుడు భవిష్యత్ లో తలెత్తే పరిపాలనా పరమైన,నిర్వహణాపరమైన సాంకేతిక అంశాలకు సందిగ్ధత
తొలగించవచ్చన్నారు.ప్రభుత్వం
లోతైన అధ్యయనం చేసి కాకినాడ గేట్ వే పోర్ట్ పేరును కోన గేట్ వే ఫోర్ట్ గా మార్చే ప్రక్రియను ప్రారంభించాలని ఆలేఖలో యనమల ప్రభుత్వాన్ని కోరారు
కోన ప్రాంత ప్రజల తరుపున ఇదే అంశంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి సి.పి.యం వినతిపత్రం

**వి.ఆర్.పురం(మనసులోమాట) జూలై 14;**



మండల పరిధిలోని ములకనపల్లి, కుందులూరు గ్రామ పంచాయితీల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సి.పి.యం నాయకులు ములకనపల్లి జోన్ కమిటీ ప్రతినిధులు స్థానిక ములకనపల్లి సచివాలయ సెక్రటరీకి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులు, గిరిజనుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. వీధిలైట్ల ఏర్పాటు, వర్షాకాలం ప్రారంభమవడంతో గ్రామాల్లో కరెంట్ లేక చీకటి అలుముకుంటోందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేకపోవడంతో విష పురుగులు, దోమల భయంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని తెలిపారు. తక్షణమే అన్ని గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి వెలుతురు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పారిశుధ్య పరిరక్షణ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని కోరారు. తక్షణమే పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి బోర్లు, బోర్ ప్లేట్ల నిర్మాణం గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి తాగునీటి బోర్లు బాగు చేయడంతో పాటు, వాటి చుట్టూ మురికి నీరు చేరకుండా పటిష్టమైన బోర్ ప్లేట్లు నిర్మించాలని కోరారు. అలాగే పాడైపోయిన మోటార్లను రిపేర్ చేసి పైప్‌లైన్ల ద్వారా సురక్షితమైన తాగునీటిని పునరుద్ధరించాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఆఫ్లైన్‌లోనే ఇవ్వాలి ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు వరి విత్తనాలు, ఎరువులను ఆన్‌లైన్ పద్ధతిలో కాకుండా ఆఫ్లైన్ విధానంలో నేరుగా అందించాలని డిమాండ్ చేశారు. సాంకేతిక ఇబ్బందుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు, దళారీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. జల్లివారిగూడెం, కుంజవారిగూడెం, టేకులూరు, కుందులూరు, తెల్లవారిగూడెం గ్రామాలకు 1 ఫేజ్ లైన్ ఇచ్చి కఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి. అర్హులైన లబ్ధిదారులందరికీ 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి.వీరపాపనకుంట, గొల్లగూడెం నుండి ములకనపల్లి వరకు నిలిచిపోయిన బి.టి. రోడ్ పనులు.కారంగూడెం జంక్షన్ నుండి ఏ.జి. కోడేరు వరకు తక్షణమే బి.టి. రోడ్ పనులు ప్రారంభించాలన్నారు. అధికారులు స్పందించి ఈ ప్రధాన సమస్యలతో పాటు పెండింగ్ రోడ్డు పనులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, గిరిజనుల పోడు భూముల పట్టాల సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సి.పి.యం నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూనె నాగేశ్వరరావు, కుంజ రాజయ్య, బంగారు ప్రసాద్, మోసం శేఖర్, కారం సుమన్, ముత్యాలరావు, జోగారావు, ముత్తయ్య, దుర్గారావు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## విద్యా దాతలు ఆశయాలు మరువలేనివి భానోజీ రామర్స్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి



**పి గన్నవరం జులై 14 (మనసులో మాట )**

అయినవిల్లి మండలం, విలాస గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థలదాత కీర్తిశేషులు జిల్లెల్ల భానోజీ రామర్స్ మంగళవారం. విగ్రహాన్ని పి. గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్య పరమావధిగా భావించిన మహోన్నత వ్యక్తి జిల్లెల్ల భానోజీ రామర్స్ ఆశయాలు మరువలేనివని పేర్కొన్నారు.. "అన్ని దానాల్లో విద్యాదానం గొప్పది" అనే భావనతో, ఆ రోజుల్లోనే ఈ పాఠశాల కోసం 1.7 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వడం వారి గొప్ప దాతృత్వానికి నిదర్శనమని అన్నారు. అలాగే అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ కళాశాల కోసం 24 ఎకరాల భూమిని కేటాయించడం వారి విద్యాసేవకు మరో గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు.

ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకొని గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడా విద్యనే ఆయుధంగా చేసుకొని ప్రపంచ మేధావిగా ఎదిగారని గుర్తు చేస్తూ, విద్యార్థులందరూ కష్టపడి చదివి తమ గ్రామానికి, మండలానికి, రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

అలాగే కీర్తిశేషులు జిల్లెల్ల భానోజీ రామర్స్ ఆరో కుమారుడు వెంకట శ్రీనివాస్ రామర్స్ తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని, ఆయన చేసిన సేవలను సభలో వివరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మరియు నిర్వాహకులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ప్రతి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ డాగురే చారిటబుల్ ట్రస్టులో ఇన్సూరెన్స్ చేయించుకోండి


**కోటనందూరు (మనసులో మాట)జూలై 14**



ప్రతి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ డాగురే ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ చారిటబుల్ ట్రస్ట్ లో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి దొంగబాబు తెలియజేశారు. కోటనందూరులో అమావాస్య మీటింగ్ సందర్భంగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దొంగబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ఈ ట్రస్ట్ లో ఇన్సూరెన్స్ చేయించడం వలన కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని, ఇంతకుముందు ఇన్సూరెన్స్ చేయించుకున్న వారు 500 రూపాయలు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని, కొత్తగా చేయించుకునేవారు 1000 రూపాయలు మరియు ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించాలని తెలియజేశారు. విజయవాడలో 1.2.3 తేదీల్లో జరిగే విజయవాడ ఫోటో ట్రేడ్ షోలో పాల్గొని ఇక్కడ ప్రదర్శించే నూతన టెక్నాలజీలో వచ్చే ప్రోడక్టు తెలుసుకోవాలని, మీకు కావాల్సిన స్టూడియో మెటీరియల్ ఫోటో అండ్ వీడియో కెమెరా లు మరియు మెటీరియల్ వగైరా అన్ని డిస్కౌంట్ లో లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సెక్రటరీ ప్రగడ సెక్రరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రేడ్ షో కి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జి రాజు, వంకల నాని, సి హెచ్ రామ్మోహన్, ఎల్ బాలరాజు, పి గణేష్, లెక్కల వెంకటరమణ, పి రాజేంద్రప్రసాద్, పి కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ 2026 గడువు పొడిగింపు

**ఏలూరు, జూలై , 14 (మనసులో మాట)**



ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)2026 గడువును పెంచుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసారని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఈ నెల 24వ తేదీ వరకు బి ఎల్ ఓ ల ద్వారా ఇంటింటికీ సందర్శిస్తారని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు సమర్పిస్తారన్నారు. ఈనెల 31 వతేదీన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురించడం జరుగుతుందని, ఈనెల 31వ తేదీ నుండి ఆగష్టు, 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను స్వీకరిస్తారని, సెప్టెంబర్ 28 వతేదీ లోగా నోటీసులు జారీ, అభ్యంతరాలను పరిష్కరిస్తారని, తుది జాబితా అక్టోబర్, 3వ తేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి బూత్ లెవెల్ అధికారి, తమ పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి గణన ఫారంను ఓటర్లకు అందచేయ్యుట, డిజిటైజేషన్ మొదలైన కార్యక్రమాలు ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని సమస్త ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ప్రజలు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

## మాజీ మంత్రి ముద్రగడ మృతి పై పలువురు సంతాపం

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకే కాకుండా యావత్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తన వైపు తిప్పుకునేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు ముద్రగడ పద్మనాభం మృతి యావత్ రాష్ట్రానికే తీరనిలోటని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయ పడ్డారు. ఏ పని తలపెట్టిన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని తను అనుకున్నదే న్యాయమని దాని కోసం ఎంత దూరమైనా ఎంత త్యాగానికైనా అయిన తెగించి ముందుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. చివరి దశలో కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయనకు ఒక మచ్చని తెచ్చిపెట్టింది లేకుంటే రాష్ట్రంలో కాపుల్లో ముఖ్యమంత్రి హోదా చేసే అర్హత ఆయనకు ఉండేది కానీ ఆయన తీసుకున్న కొన్ని తొందరపాటు నిర్ణయాల వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తుకే కాకుండా కుటుంబానికి కూడా తీరని లోటని ఏది ఏమైనా ముద్రగడ మరణం రాష్ట్రానికి కాపు జాతికి తీరనిలోటని ఆయన అభిమానులు రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు

## మహిళలు వారి భద్రత కోసం ఉన్న చట్టాల పై అవగాహన కలిగి ఉండాలి




**వి.ఆర్.పురం (మనసులో-మాట) జూలై 14;**

భారతదేశంలో మహిళల భద్రత, సమానత్వం, సాధికారత కోసం రాజ్యాంగ హక్కులతో పాటు అనేక ప్రధాన చట్టాలు అమలులో ఉన్నాయనీ, వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని ఎస్ఐ సాదిక్ అన్నారు. స్తానిక కేజీబీవీ స్కూల్ రేఖపల్లి నందు మహిళా చట్టాలు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఉండే విద్యా అవకాశాల గురించి ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ నాగుల్ మీర రేఖపల్లి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ నీలోఫర్, ఎస్ఐ సాదిక్ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నీలోఫర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణం వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం. కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు.

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల యనమల దిగ్భ్రాంతి.

**తుని (మనసులో మాట) జులై 14**



మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల తెలుగు దేశంపార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు మాజీ ఆర్ధిక మంత్రి యనమల రామకృష్ణుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.1978లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి జనతా పార్టీ తరుపున పోటీ చేసి ఎమ్మెల్యే గా గెలుపొందిన ముద్రగడ పద్మనాభం ఆతర్వాత తెలుగు దేశం పార్టీలో చేరిన శాసనసభ్యుడిగాను, మంత్రిగా కాకినాడ పార్లమెంటు సభ్యుడు గా పని చేసారని గుర్తు చేసిన యనమల రామకృష్ణుడు, ముద్రగడ హఠాన్మరణం బాధాకరమన్నారు మంత్రిగా,ఎంపీగా ఎమ్మెల్యేగా పనిచేసిన పద్మనాభం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు విశేష సేవలందించారని యనమల తన సంతాప ప్రకటనలో పేర్కొన్నారు.ముద్రగడ మృతి తీరని లోటన్నారు.పద్మనాభం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన రామకృష్ణుడు,,,పద్మనాభం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

# కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం.

- **రైతులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు వ్యాపార అవకాశాలపై అవగాహన.**
- **జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్.**



**అమలాపురం( మనసులోమాట) జులై 14:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 16,17 తేదీలలో నిర్వహించనున్న కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ 2026 కార్యక్రమానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు జిల్లా లైజనింగ్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16, 17 తేదీలలో అనాతవరం వేదిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ 2026 మీటింగ్ సంబంధించిన ఏర్పాట్లు, వర్క్ షాప్ నిర్వహణకు సంబంధించిన సన్నద్ధత ముందస్తు చర్యలపై సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులు బ్యాంకర్లు ఏపీఐఐసీ వాయర్ బోర్డ్ ప్రతినిధులు ఉద్యానవన మార్కెటింగ్ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష లో అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

కేరళ నుండి క్వాయర్ పరిశ్రమలకు సంబంధించిన శాస్త్రవేత్తలను స్థానికంగా వర్క్ షాప్ కు పిలిపించి స్థానికంగా ఉన్న అవకాశాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరి పూర్ణమైన అవగాహన కల్పిస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వ రాయితీ పథకాలు బ్యాంకర్ల రుణాల కల్పనతో సమన్వయపరిచి అన్ని విధాల ప్రోత్సహించి స్థానికంగా డ్వాక్రా సంఘం మహిళ లకు ఎం ఎస్ ఎంఈ పథకాల ద్వారా మెరుగైన జీవనో పాదులు కల్పనకు కృషి చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని లక్ష్యిత వర్గాల వారు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో కొబ్బరి పంట విస్తారంగా పండుతుందని, అయితే కేవలం ముడి సరుకుగా కాకుండా, దాని నుండి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలను స్థాపించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరు గుతాయని పేర్కొన్నారు.

ఉద్యానవన, మార్కెటింగ్, పరిశ్రమల శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ వర్క్ షాప్ విజయవంతానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నూత నంగా పరిశ్రమలు స్థాపించాల నుకునే ఔత్సా హికులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, ముద్రా, పీఎంఈజీపీ వంటి రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారంగా వ్యవ హరించాలన్నారు వర్క్షాప్లోనే బ్యాంక్ స్టాళ్లను 2, ఉద్యాన శాఖ ఒకటి, క్వాయర్ బోర్డు 2 ,క్వాయర్ హస్తకళలకు సంబంధించి 2 , ఎం ఎస్ ఎం ఇ , తరపున ఒకటి విలువ ఆధారిత వస్తువుల తయారీ సంబంధించి 2 ,స్టాళ్లను వెరసి ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమా వేశంలో జిల్లా పరిశ్ర మల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ రాదామణి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ, కాయర్ బోర్డ్ సహాయ అధికారి పవన్ కిరణ్, క్వాయర్ బోర్డు ప్రాంతీ య అధికారులు, జిల్లాఉద్యాన శాఖ అధికారి బి వి రమణ మార్కెటింగ్ శాఖ కే విశాలాక్షి, డిఆర్డిఎ పిడి: డి రాం బాబు, తదితరులు పాల్గొ న్నారు.

# డ్రోన్ ద్వారా బూరుగువాడ బీట్‌లో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

**వి.ఆర్.పురం(మనసులోమాట) జూలై 14;**



ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీడ్ బాల్స్ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం చింతూరు అటవీ డివిజన్ పరిధిలోని వి.ఆర్.పురం రేంజ్, బూరుగువాడ సెక్షన్‌లోని బూరుగువాడ బీట్‌లో డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా డి. రవీంద్రనాథ్ రెడ్డి ఐఎఫ్ఎస్, డివిజినల్ అటవీ శాఖాధికారి, చింతూరు, కె. రాఘవరావు, ఎస్ ఎఫ్ ఎస్, సబ్‌డివిజినల్ అటవీ శాఖాధికారి, కూనవరం, ఎస్. రామకృష్ణ, అటవీ క్షేత్రాధికారి, వి.ఆర్.పురం పాల్గొని డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. బూరుగువాడ బీట్‌లో 18,000 సీడ్ బాల్స్ మరియు దారపల్లి బీట్‌లో 18,000 సీడ్ బాల్స్, మొత్తం 36,000 సీడ్ బాల్స్ డ్రోన్ ద్వారా వెదజల్లారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించి చేరుకోలేని కొండ ప్రాంతాల్లో సీడ్ బాల్స్‌ను వెదజల్లడం ద్వారా, సహజ వృక్ష సంపదను పెంపొందించడం, పచ్చదనాన్ని విస్తరించడం, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని, స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వివిధ జాతుల విత్తనాలతో, తయారు చేసిన సీడ్ బాల్స్‌ను విస్తృత స్థాయిలో వెదజల్లడం ద్వారా, భవిష్యత్తులో అటవీ విస్తీర్ణం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం రేంజ్‌కు చెందిన ఎమ్.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, జీడిగుప్ప సెక్షన్, ఎమ్.రాధ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, బూరుగువాడ సెక్షన్, ఆర్. హరీష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, బూరుగువాడ బీట్, పి.భాస్కర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ , దారపల్లి బీట్, బేస్ క్యాంప్ హెల్పర్లు పాల్గొన్నారు.

# భీమా ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో సందిగ్ధం

- **గత ఏడాది నష్టపోయిన వారికి పరిహారం అందక ఆందోళన**
- **కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్న కోలంక రైతులు**

**కాజులూరు (మనసులో మాట) జూలై 14**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పంటల భీమా ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో తీవ్ర సందిగ్ధ పరిస్థితి నెలకొంది. గత ఏడాది ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇప్పటికీ భీమా పరిహారం అందకపోవడంతో ఈ ఏడాది ప్రీమియం చెల్లించాలా వద్దా అనే అయోమయంలో రైతులు ఉన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన

రైతుల కథనం ప్రకారం, గత ఏడాది సంభవించిన 'మెంతా' తుఫాన్ కారణంగా పలు ప్రాంతాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నష్టాన్ని అధికారులు నమోదు చేసినప్పటికీ, అర్హులైన రైతులందరికీ భీమా పరిహారం అందలేదని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కోలంక గ్రామ రైతులు తమకు న్యాయం చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా ఆశించిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భీమా పరిహారం అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ఈ ఏడాది భీమా ప్రీమియం చెల్లింపుపై సందిగ్ధంలో ఉన్నారు. గత నష్టాలకు పరిహారం అందించకుండా కొత్త సీజన్‌కు ప్రీమియం చెల్లించాలని కోరడం సమంజసం కాదని వారు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ రంగంలో భీమా పథకం రైతులకు భరోసాగా నిలవాల్సి ఉండగా, పరిహారం మంజూరులో జాప్యం రైతుల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, వాతావరణ అనిశ్చితి నేపథ్యంలో భీమా పరిహారం సకాలంలో అందడం అత్యంత అవసరమని వారు అంటున్నారు.

ఈ నేపథ్యంలో గత ఏడాది నష్టపోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న భీమా పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన భీమా ప్రీమియం చెల్లింపు విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

# రైతుల అవసరాల మేరకు ఎరువులు అందిస్తున్నాం

- **జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదు, రైతుల అవసరాల మేరకు ఎరువుల నిల్వలు ఉన్నాయి**
- **ఏపిఏఐఎంఎస్ యాప్ పై ప్రతీ రైతుకు అవగాహన కలిగించాలి**
- **జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం**

**ఏలూరు, జూలై 14(మనసులో మాట)**



జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని,రైతుల అవసరాల మేరకు ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ మరియు ఎరువుల శాఖ సంయుక్తంగా రూపొందించిన నేషనల్ ఫెర్టిలైజర్ ఫ్రేమ్‌వర్క్ మార్గదర్శకాల మేరకు ఖరీఫ్-2026 సీజన్‌లో సబ్సిడీ యూరియా మరియు డీఏపీ ఎరువుల పంపిణీని మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్ విధానంలో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏపిఏఐఎంఎస్ యాప్ పై ప్రతీ రైతుకు అవగాహన కలిగించి వినియోగించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్-2026 సీజన్‌లో ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించేందుకు రైతులు తమ భూమి, పంట మరియు సాగుదారు వివరాలను ముందుగానే నవీకరించుకునేలా, ఎరువుల విక్రేతలు నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ డిజిటల్ విధానం ద్వారా నిజమైన సాగుదారులకు ఎరువులు సకాలంలో అందడంతో పాటు డిమాండ్ అంచనా, సరఫరా గొలుసు నిర్వహణ మరియు ప్రభుత్వ ప్రణాళికల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాలో జూన్ 8, 2026 నుండి ఏపీ ఏఐఎంఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. కొత్త డిజిటల్ విధానానికి రైతులు, ఎరువుల విక్రేతల నుంచి మంచి స్పందన లభిస్తున్నదన్నారు. జూన్ 8 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఏపీ ఏఐఎంఎస్ ద్వారా మొత్తం 4,290 మెట్రిక్ టన్నుల యూరియా మరియు 1,069 మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయాలు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ విధానం ద్వారా రైతుల భూమి, సాగు పంటలు మరియు అర్హత వివరాల ఆధారంగా అవసరమైన ఎరువులను పారదర్శకంగా, సమర్థవంతంగా పంపిణీ చేయడంతో పాటు అనధికార కొనుగోళ్లను నివారించడం, నిజమైన సాగుదారులకు సకాలంలో ఎరువులు అందించడం, ఎరువుల దుకాణాల వద్ద రద్దీని తగ్గించడం మరియు సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ఖరీఫ్-2025 ఈ పంట వివరాలను ప్రాథమిక డేటాగా తీసుకుని ఖరీఫ్-2026 సాగు వివరాలు నవీకరించబడతాయని, రైతులు తమ గ్రామంలోని సంబంధిత రైతు సేవా కేంద్రం (ఆర్ ఎస్ కె)ను సంప్రదించి భూ వివరాలు, సాగుదారు, పంట, సాగు విస్తీర్ణం వంటి వివరాలను అవసరమైతే తప్పనిసరిగా సరిచేయించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.కొత్త సాగుదారులు లేదా మార్పులు అవసరమైన రైతులు ఆధార్, మొబైల్ నంబర్ ఆధారంగా ఓటిపి ధృవీకరణ అనంతరం తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. . ఇప్పటికే ఎరువులు కొనుగోలు చేసినట్లయితే మిగిలిన అర్హత మేరకే ఎరువులు పొందగలరన్నారు. ఎరువుల విక్రయ విధానం: చెల్లుబాటు అయ్యే ఎరువుల లైసెన్స్ కలిగిన ప్రైవేట్ రిటైలర్లు, పిఏసిఎస్ మరియు రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్కెఎస్) మాత్రమే ఏపీ ఏఐఎంఎస్ ద్వారా యూరియా మరియు డీఏపీ ఎరువులను విక్రయిస్తాయన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్ సంఖ్య నమోదు చేయాలని, ఓడిపి ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలని,భూమి,పంట మరియు ఎరువుల అర్హత వివరాలను పరిశీలించాలని,అర్హత మేరకే యూరియా లేదా డీఏపీ ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. ఏపీ ఏఐఎంఎస్ లో నమోదైన ప్రతి విక్రయం ఐఎఫ్ఎమ్ఎస్ ఆధారిత పి ఓ ఎస్ యంత్రంలో అదే ఆధార్ సంఖ్యతో పూర్తిచేయడం తప్పనిసరని,రెండు వ్యవస్థల వివరాలు పరస్పరం సరిపోల్చబడతాయని, వ్యత్యాసాలు గుర్తించినట్లయితే సంబంధిత వారిపై చర్యలు తీసుకోబడతాయన్నారు. యూరియా మొత్తం అర్హత మూడు బస్తాలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే రైతులు ఒకేసారి లేదా విడతల వారీగా కొనుగోలు చేయవచ్చన్నారు.మూడు బస్తాలకు మించిన అర్హత ఉన్న రైతులకు మూడు విడతల్లో సరఫరా చేయబడుతుందని,ప్రతి విడతలో మొత్తం అర్హతలో మూడవ వంతు లేదా మూడు బస్తాలు, ఏది ఎక్కువైతే అది అందజేయబడుతుందన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి మరియు మిరప ప్రధాన పంటలకు ఎకరానికి ఒక బస్తా (50 కిలోలు) డీఏపీ ఎరువుకు అర్హత ఉంటుందని, ఒక్క లావాదేవీలో గరిష్ఠంగా పది బస్తాల వరకు మాత్రమే డీఏపీ కొనుగోలు చేయవచ్చన్నారు.


రైతులు ఎక్కువగా వినియోగించే ఎరువుల దుకాణాలను సంబంధిత రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేయడం జరిగినదని,అవసరమైతే ఒకే ఎరువుల దుకాణాన్ని ఒకటి కంటే ఎక్కువ రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. .

ప్రత్యేక భూములు మరియు సంస్థల నమోదు:ePanta లో లేని భూములు, సంస్థల భూములు మరియు ఇతర ప్రత్యేక భూముల వివరాలను సంబంధిత మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) ద్వారా నమోదు చేయవచ్చన్నారు. నమోదు చేసిన వివరాల ఖచ్చితత్వానికి సంబంధిత మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారన్నారు. ఎరువుల విక్రయాలను వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని, దుకాణాల వారీగా విక్రయాలు, రైతుల వారీ లావాదేవీలు మరియు కాలవ్యవధి వారీ యూరియా, డీఏపీ విక్రయాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించబడతాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల దుకాణాలపై సస్పెన్షన్‌తో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. ఏపీ ఏఐఎంఎస్ సంబంధిత సాంకేతిక సమస్యలు, నమోదు మరియు విక్రయ ప్రక్రియలపై సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయబడిందని,జిల్లా స్థాయిలో కూడా సహాయ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతుందన్నారు.

## కాకినాడ బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ గోల్డ్ గోల్ మాల్

- **కోటి విలువైన బంగారం స్వాహా చేసిన అప్రైజర్ సూరిబాబు**

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**




కాకినాడ నగరంలోని ప్రభుత్వ సర్వజన హాస్పటల్ ప్రాంగణం లో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో భారీ మోసం మంగళవారం వెలుగుచూసింది. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారులను మోసం చేస్తూ దాదాపు రూ. కోటి విలువైన అసలు బంగారాన్ని మాయం చేసి, వాటి స్థానంలో నకిలీ నగలను ఉంచినట్లు తేలింది. బ్యాంకు గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్న నవర సూరిబాబు (కాకినాడ గ్రామీణం, చీడిగ నివాసి) ఈ మాయకు పాల్పడ్డాడు.ఈ బ్యాంకు శాఖలో జీజీహెచ్‌కు చెందిన పలువురు వైద్యులు, నర్సులు, మినిస్టీరియల్ ఉద్యోగులు తదితర ఖాతాదారులు తమ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. సాధారణంగా ఖాతాదారులు తెచ్చిన బంగారాన్ని పరీక్షించి, మేనేజర్ సమక్షంలో లాకర్‌లో భద్రపరచడం అప్రైజర్ సూరిబాబు విధి. అయితే, ఇటీవల కొంతమంది ఖాతాదారులు తమ రుణాలు చెల్లించి బంగారం వెనక్కి తీసుకునేందుకు రాగా, సూరిబాబు పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేశాడు. దీనితో అనుమానం వచ్చిన ఖాతాదారులు అతడిని గట్టిగా నిలదీశారు. ఈ విషయం పెద్దది కావడంతో బ్యాంక్ అధికారులు రికార్డులను, లాకర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో షాకింగ్ నిజాలు బయట పడ్డాయి. రికార్డుల ప్రకారం ఉండాల్సిన 789 గ్రాముల బంగారానికి బదులుగా కేవలం 589 గ్రాముల బంగారమే ఉంది. అంతేకాకుండా, లాకర్‌లో ఉన్న ఆ ఆభరణాలు కూడా నకిలీవని కూడా తేలింది.బ్యాంక్ మేనేజర్ ఇడియాల నరసింహ భాను అభిరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ వన్ టౌన్ (ఒకటో పట్టణ) పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు, అప్రైజర్ నవర సూరిబాబును పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కుంభకోణంలో ఇంకా ఎవరి హస్తమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు

## ఎస్ఐఆర్ ప్రక్రియ నూరు శాతం పూర్తి

- **తాహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్**

**కాజులూరు (మనసులో మాట) జూలై 14**



మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నూరు శాతం ఆన్‌లైన్‌లో పూర్తి చేసినట్లు తాహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు.

మంగళవారం తాహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని 26 గ్రామాలకు సంబంధించిన ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఓటర్ల వివరాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు, ఆధార్ కార్డుల ప్రతులు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను కేటగిరీల వారీగా వేరు చేసి తహసిల్దార్ కార్యాలయానికి సమర్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

మరణించిన ఓటర్ల వివరాలు, గ్రామాంతరం వెళ్లిన వారి వివరాలు, ప్రస్తుతం గ్రామాల్లో నివసిస్తూ ఓటు హక్కుకు అర్హులైన వారి వివరాలను విడివిడిగా గుర్తించి సంబంధిత రికార్డులతో కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తాహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదేశించారు.

## పైడి పుట్టలో అల్లూరి రచ్చబండ వద్ద గంగాలమ్మ వారికి పూజలు హోమాలు.



**రంపచోడవరం ,( మనసులో మాట) జూలై 14**

పోలవరం జిల్లా అడ్డతీగల మండలం పైడి పుట్ట గ్రామం లోఅల్లూరి శ్రీరామ రాజు రచ్చబండ ఆవరణంలో కొలువై ఉన్న శ్రీ మాతృ గంగాలమ్మ తల్లి ప్రాంగణంలో మంగళవారం అమావాస్య ను పురస్కరించుకొని పూజలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ అయ్యప్ప పురోహితులు వేదమంత్రచారణనడుమ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆశీస్సులను ఇచ్చారు. ఈ పూజ హోమాధి కార్యక్రమాల్లో అల్లూరి వంశీకులు అల్లూరి మనుమడు అల్లూరి. శ్రీరామరాజు కుటుంబ సమేతంగా పాల్గొని ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య రోజున పూజలు, హోమాలు నిర్వహిస్తామని, అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పవన్ గిరి స్వామీజీ తణుకు. వెంకటరామయ్య దంపతులు, వి. నాగార్జున, పరదా. సోమన్న దొర దంపతులు, పరదా. పార్వతీ దంపతులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఇంచార్జీగా తాతాజీ తొలి పర్యటన:



- పార్టీ బలోపేతమే లక్ష్యం - నార్ని తాతాజీ

**తణుకు (మనసులో మాట) జూలై 14:**

ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన ఇంచార్జీగా నియమితులైన తాతాజీ జిల్లాలో తన తొలి అధికారిక పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.
పర్యటనలో భాగంగా నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లా సరిహద్దుకు చేరుకున్న తాతాజీకి పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీతో ఎదురేగి ఘనంగా స్వాగతించారు. ప్రతి డివిజన్, మండల పరిధిలో బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. సీనియర్ నాయకులు, యువ కార్యకర్తలు సమన్వయ లోపం లేకుండా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, బీజేపీ నిరంతరం గళం విప్పాలని దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తు కార్యాచరణ ను వివరిస్తూ రాబోయే రోజుల్లో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## జగన్ భీమవరం పర్యటన విజయవంతానికి ఆచంటలో వైసీపీ సమాయత్తం

**ఆచంట, జూలై 14(మనసులో మాట)**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 15న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటించి ఆక్వా రైతులు, రైతు నాయకులతో సమావేశం కానున్న నేపథ్యంలో ఆచంట నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి.
ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, నియోజకవర్గ కోఆర్డినేటర్ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చెరుకువాడ నరేష్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, మాజీ రుడా చైర్‌పర్సన్, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిళ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. భీమవరంలో జరిగే వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ఆక్వా రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. పర్యటన విజయవంతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు రైతుల సమస్యలను బలంగా వినిపించే వేదికగా ఈ పర్యటన నిలవాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

# ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు: జగ్గిరెడ్డిపై భగ్గుమన్న టీడీపీ శ్రేణులు

- పోలీసులకు ఫిర్యాదు

**అమలాపురం(మనసులోమాట) జూలై14:**



వైస్సార్ కాంగ్రెస్ పార్టీ డా||బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిపై టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సోమవారం కొత్తపేట నియోజకవర్గం పిచ్చుకలంకలో పర్యటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై, ముమ్మిడివరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జగ్గిరెడ్డి చేసిన వ్యాఖ్యలను టీడీపీ తీవ్రంగా ఖండించింది.
రామచంద్రపురం నియోజకవర్గం టీడీపీ పార్టీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి మాట్లాడుతూ... జగ్గిరెడ్డి ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేస్తూ, బీసీ ఉపకులాలు అయిన సంచార జాతులకు చెందిన "బుడబుక్కల" సామాజిక వర్గాన్ని తీవ్రంగా కించపరిచేలా మాట్లాడారని మండిపడ్డారు. వెనుకబడిన, సంచార జాతుల సామాజిక వర్గాలను అవమానించినందుకు గానూ జగ్గిరెడ్డి వెంటనే బీసీ ఉపకులాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెంద్ర రమేష్, రామచంద్రపురం ఏఎంసీ చైర్మన్ అక్కల రిస్వంత్ రాయ్ తదితరులు పాల్గొని జగ్గిరెడ్డి వైఖరిని తప్పుపట్టారు.

**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు, బీసీ ఉపకులాలను కించపరిచిన చిర్ల జగ్గిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ లను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్ర చైర్మన్ పెంద్ర రమేష్, కోనసీమ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ వెంట్రు సుధీర్ ఉన్నారు.

# పవర్‌పేట ఆర్వోబీతో నగరాభివృద్ధికి కొత్త దిశ: ఎమ్మెల్యే బడేటి చంటి





**ఏలూరు, జూలై 14 (మనసులో మాట)**

ఏలూరు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. భవిష్యత్తులో నగర ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పవర్‌పేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టపోయే వారికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.
మంగళవారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా పవర్‌పేట స్టేషన్ రోడ్డుకు చెందిన వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి, ఆర్వోబీ నిర్మాణం వల్ల తమ వ్యాపారాలకు నష్టం కలుగుతుందని, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్వోబీ నిర్మాణం వల్ల వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయనున్నందున ప్రజల రాకపోకలు, వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.
పవర్‌పేట లో బ్రిడ్జిలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారంగా ఆర్వోబీ నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. నగరంలోని సుమారు మూడు లక్షల మంది ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.
అలాగే 2029 నాటికి దేశవ్యాప్తంగా రైల్వే గేట్లను తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగానే ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. సర్వీస్ రోడ్లతో వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో కూడా వ్యాపారాలను కొనసాగించుకునే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.

# బీజేపీ నేత కు మాతృ వియోగం... పలువురి పరామర్శ...

**మండపేట (మనసులో మాట) జూలై 14**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కపిలేశ్వరపురం మండల అధ్యక్షుడు నామాల శ్రీనివాస్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి నామాల సత్యవతి (80) మరణించారు. సత్యవతి మరణవార్త తెలియడంతో కపిలేశ్వరపురం మండలంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, స్థానిక నాయకులు బీజేపీ శ్రేణులు నామాల శ్రీనివాస్ నివాసానికి చేరుకుని, దివంగత సత్యవతి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ నెక్కంటి శ్రీ రాంజీ,పర్వతిన మురళీ కృష్ణ (చిన్నా), బలవరెడ్డి సత్తిబాబు, నియోజకవర్గం బీజేపీ సీనియర్ నేతలు కోన సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, లొల్ల రాంబాబు, తదితర నేతలు పరామర్శించి
ఈ కష్టసమయంలో నామాల శ్రీనివాస్ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని,ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రముఖులు తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు

